Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 8 మేడ్చల్ మల్కాజ్‌గిరి 1 ఫిబ్రవరి 2024 గురువారం పేజీలు : 4

### మాల్దీవులకు భారత పర్యాటకుల ఝలక్

న్యూఢిల్లీ : మాల్దీవుల దేశంలో పర్యటించే భారతీయుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇరుదేశాల మధ్య ఏర్పడిన విభేదాలే దీనికి కారణం. గతేడాది మాల్దీవులను అత్యధిక పర్యాటకులు సందర్శించిన దేశాల జాబితాలో భారత్ తొలి స్థానంలో నిలువగా, ఈ ఏడాది జనవరి 28వ తేదీ నాటికి భారత్ 5వ స్థానానికి పరిమితమైంది. మాల్దీవుల పర్యాటక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరి 28 నాటికి మాలీవులను అత్యధికంగా సందర్శించిన పర్యాటకుల సంఖ్య పరంగా రష్యా(18,561 మంది) తొలి స్థానానికి చేరింది. తర్వాతి స్థానాల్లో ఇటలీ, చైనా, బ్రిటన్, భారత్(13,989) నిలిచాయి.

# ‘గరీబీ హఠావో’ నినాదానికి రూపునిచ్చాం




## పార్లమెంట్‌లో రాష్ట్రపతి తొలి ప్రసంగం..

ఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఈ సమావేశాలు కొనసాగనుండగా ప్రస్తుత లోక్‌సభకు ఇవే చివరి సమావేశాలు కావడం గమనార్హం. నూతన పార్లమెంట్ భవనంలో ఇవే మొదటి సమావేశాలు. ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ఈ సమావేశాలు ప్రారంభయ్యాయి. ఫిబ్రవరి 1న లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. వికసిత భారతావనిని నిర్మించే పనిలో గడిచిన పదేళ్లలో ఎన్నో మైలు రాళ్లు చేరుకున్నామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. పార్లమెంటు సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆమె ఉభయసభలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. తమ ప్రభుత్వం సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో చూస్తుందని.. దేశాభివృద్ధి కోసం కట్టుబడి ఉందని ఆమె అన్నారు. నూతన పార్లమెంటు భవనంలో తనది తొలి ప్రసంగమని చెప్పారు. భారత సంస్కృతి సభ్యత ఎంతో చైతన్యవంతమైనదని గుర్తు చేశారు. “దేశంలో లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. నారీశక్తి వందన్ అధినీయం బిల్లును ఆమోదించడంతో చట్ట సభల్లోవారి ప్రాతినిధ్యం 33 శాతం పెరుగుతుంది. ఆసియా క్రీడల్లో తొలిసారి 107 పతకాలు, పారా క్రీడల్లో 111 పతకాలను భారత్ సాధించింది. తొలిసారి నమో భారత్ రైలును ఆవిష్కరించాం. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ఉన్న అన్ని ఆటంకాలు అధిగమించి.. ప్రపంచమే మెచ్చేలా రాములవారి ఆలయాన్ని నిర్మిస్తున్నాం. దీంతో ఎన్నో ఏళ్ల భారతీయుల కల సాకారమైంది. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. తెలంగాణలో సమ్మక్క – సారక్క గిరిజన వర్సిటీకి శంకుస్థాపన చేశాం. దేశంలో 5జీ నెట్‌వర్క్ వేగంగా విస్తరిస్తోంది.

అందుకు తగినట్లు టెక్నాలజీలో మార్పులు తీసుకొచ్చాం. రక్షణ, అంతరిక్ష రంగాల్లో కొత్త ఆవిష్కరణలు జరిగాయి. కొత్త క్రిమినల్ చట్టాలను ఆమోదించుకున్నాం. భగవాన్ బిర్సాముండా జన్మదిన్నాన్ని జన్ జాతీయ దివస్‌గా జరుపుకుంటున్నాం. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. సూర్యుడిపై ప్రయోగాల్లో భాగంగా ఆదిత్య ఎల్ – 1 మిషన్ విజయవంతం అయింది. జీ 20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించాం” అని ముర్ము తన ప్రసంగంలో ప్రస్తావించారు.

# కారు స్క్రాప్ కింద అమ్ముకున్నారు!

## బీఆరెస్స్ పార్టీపై విమర్శల దాడిని పెంచిన కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్ : గతకొన్ని రోజులుగా కాంగ్రెస్ నేతలు బీఆరెస్స్ పై విమర్శల దాడిని పెంచుతూపోతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. బీఆరెస్స్ పార్టీపై విమర్శలు గుప్పించారు. ఇందులో భాగంగా కారు సర్వీసింగ్ కు పోలేదని.. దాన్ని ఎప్పుడో ముక్కలు చేసి కిలోల చొప్పున స్క్రాప్ కింద అమ్ముకున్నారని వెంకట్ రెడ్డి అన్నారు. ఇదే సమయంలో.. తాము తలుచుకుంటే బీఆరెస్స్ ను 14 ముక్కలు చేయగలమని ఫైర్ అయ్యారు.

తాజాగా బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్ లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కు చెందిన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ సభలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి... రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెల రోజులు కాకముందే బీఆరెస్స్ నేతలు అవాక్కులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగా... కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఆరు నెలలే ఉంటుందని ఒకరంటే.. కేవలం సంవత్సరమేనని మరొక్కరు అంటున్నారని తెలిపారు. వాస్తవానికి బీఆరెస్స్ ఎమ్మెల్యేలు కొంతమంది తమతో టచ్ లో ఉన్నారని.. అయితే తమకు సరిపడా మెజారిటీ ఉందని.. తాము తలచుకుంటే కారు ముక్కలు కన్ ఫాం అని తేల్చి చెప్పారు.

**గత పదేళ్లలో జరిగినంత అవినీతి...!:** ఉమ్మడి రాష్టం నుండి లెక్కపెడితే తెలంగాణ రాష్టం ఏర్పడిన తర్వాత గత పదేండ్లలో జరిగినంత అవినీతి ఎన్నడూ జరగలేదని తెలిపిన మంత్రి కోమటిరెడ్డి... 11 వందల మంది తెలంగాణ బిడ్డలు ప్రాణత్యాగాలు చేసి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం కబ్జా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన పదేండ్లల్లో




తెలంగాణ ప్రజలను బతుకమ్మ చీరలకే పరిమితం చేశారని ఆరోపించారు.

ఇదే సమయంలో... నాడు తెలంగాణ రాష్ట్రం కోసం తాను మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలివేసినట్టు గుర్తుచేసుకున్న మంత్రి కోమటిరెడ్డి... త్యాగధనులపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత తప్ప ఎవరూ బాగుపడలేదని దుబ్బయట్టారు.

## ఎమ్మెల్యేగా నేడు కేసీఆర్ ప్రమాణ స్వీకారం

హైదరాబాద్: బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ గురువారం గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండో రోజే కేసీఆర్ బాత్రూంలో జారి పడంతో ఆయన తుంటి విరిగిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కేసీఆర్‌కు శస్త్ర చికిత్స జరిగింది. అనంతరం డాక్టర్ల సూచన మేరకు కేసీఆర్ గత కొంతకాలంగా విశ్రాంతి



తీసుకుంటున్నారు. ఇటీవల కర్ర సాయంతో నడవగలుగుతున్నారు. ఈ క్రమంలో అసంబ్లీ స్వీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో రేపు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి తరలిరానుండటంతో అసెంబ్లీ వర్గాలు భద్రతా ఏర్పాట్లపై దృష్టి సారించాయి.

## తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు రంగం సిద్ధం

### రెడీ అవుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్..

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఫిబ్రవరి రెండో వారంలో జరగనున్నాయి. శాసనసభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నట్లు అధికార వర్గాల సమాచారం. కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి అందనున్న నిధుల మొత్తాన్ని బేరీజు వేసుకొని పూర్తిస్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టే



దిశలో ప్రభుత్వ యోచిస్తోంది. ఈ బడ్జెట్ సమావేశాలు సుమారు 6 రోజులు కొనసాగనున్నాయి.

కాగా.. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన మొదటి అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్ సంతాప తీర్మానాలను ప్రవేశపెట్టారు. మెదక్ జిల్లా పూర్వ రామాయంపేట మాజీ ఎమ్మెల్యే రామన్నగారి శ్రీనివాస్ రెడ్డి మృతిపట్ల సభ సంతాపం తెలిపింది. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల హరీశ్వర్ రెడ్డి, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి మృతిపట్ల శాసనసభ సంతాపాన్ని తెలియజేసింది.



## ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ద్వారా త్వరలో ఉద్యోగాల భర్తీ చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగా ఎంపికైన 7,094 మంది స్టాఫ్ నర్సులకు నియామకపత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎం మాట్లాడుతూ.. త్వరలో 15వేల పోలీసు ఉద్యోగాలూ భర్తీ చేయనున్నట్టు చెప్పారు. “విద్యార్థుల త్యాగాల మీద తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. స్టాఫ్ నర్సుల నియామకం చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంది. పేదలకు ఉద్యోగాలు ఇచ్చి వారి కళ్లలో ఆనందం చూసే ప్రభుత్వం ఇది. ఆరోగ్య తెలంగాణ నిర్మించడంలో వారిదే కీలకపాత్ర.

గడిచిన పదేళ్లలో తెలంగాణ యువత ఆకాంక్షలు నెరవేరలేదు. గత ప్రభుత్వం వాళ్ల కుటుంబసభ్యుల గురించి మాత్రమే ఆలోచించింది. తెలంగాణ కోసం పోరాడిన యువతపై కేసులు పెట్టి వేధించింది. కుమార్తెను ప్రజలు ఓడిస్తే వెంటనే ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. తెలంగాణ కోసం పోరాడిన వారి ఉద్యోగాల గురించి కేసీఆర్ ఆలోచించలేదు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక నెరవేరుస్తుంది. టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళనలో భాగంగా కొత్త ఛైర్మన్, సభ్యులను నియమించాం. ఏడాదిలోగా 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం” అని సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత ప్రయాణంపై హైకోర్టులో విచారణ..

### న్యాయస్థానం ఏం చెప్పిందంటే.

హైదరాబాద్ : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై విచారణ జరిగింది. నాగోల్ కు చెందిన హరిందర్ అనే వ్యక్తి వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఉచిత ప్రయాణం వల్ల బస్సుల్లో రద్దీ తీవ్రంగా పెరిగిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కుటుంబంతో కలిసి వెళ్లినప్పుడు కూర్చునే పరిస్థితి కాదు కదా.. కనీసం నిల్చునే పరిస్థితీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత ప్రయాణం కోసం జారీ జారీ చేసిన జీఓ 47ను రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌లో ప్రజా ప్రయోజనమేమీ లేదని హైకోర్టు



పిటిషనర్ పేర్కొన్నారు. ఇబ్బందులు ఎదుర్కొని పిల్ దాఖలు చేశారన్నారు. దీంతో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని రిట్ పిటిషన్‌గా మార్చాలని రిజిస్ట్రీకి ఆదేశిస్తూ.. విచారణను ధర్మాసనం వాయిదా వేసింది. కాగా.. 2023 చివరాంకంలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించింది. ఆ హామీల్లో ఒకటైన మహాలక్ష్మి గ్యారంటీలో భాగంగా తెలంగాణకు చెందిన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ఇచ్చిన మాట ప్రకారం రేవంత్ ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసింది. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో గొడవలు, ఘర్షణలు సైతం జరగడం గమనార్హం.

# సంపాదకీయం

## సింగిల్ సీటు లేకుండా ఏపీలో బీజేపీ రూలింగ్!

ఏపీ రాజకీయాలు ఇంతకాలం ద్విముఖ పోరుగా సాగుతున్న వేళ షర్మిల ఎంట్రీతో లెక్కలు మారిపోయాయని అంటున్నారు పరిశీలకులు. నిన్నమొన్నటివరకూ అయితే వైసీపీ.. కాకపోతే టీడీపీ ం జనసేన అనే మాటలు మాత్రమే వినిపించేవని చెబుతున్నారు. అయితే... ఏపీపీసీసీ బాధ్యతలు చేపట్టినప్పటినుంచీ తాను ప్రదర్శిస్తున్న దూకుడుతో... పార్టీలో టిక్కెట్లు దొరకని అసంతృప్తులకు కాంగ్రెస్ ఒక ఆప్షన్ లా మారేలా ఆమె చేశారని అంటున్నారు. ఇక పీసీసీ చీఫ్ బాధ్యతలు తీసుకున్నప్పటినుంచీ ప్రధానంగా కేంద్రం లో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ లపై షర్మిల నిప్పులు కక్కుతున్నారు! ఈ గ్యాప్ లో అప్పుడప్పుడూ టీడీపీపై సున్నితంగా స్పందిస్తున్నప్పటికీ... ప్రధానంగా... బీజేపీ - వైసీపీలపై ఫైరవుతున్నారు. ప్రత్యేకహెూదా పేరు చెప్పి ఆమె రెండు పార్టీలపైనా విరుచుకుపడుతున్నారు. ఈ క్రమంలో మరోసారి ఏపీలో బీజేపీని అడ్డుపెట్టి అటు వైసీపీ, ఇటు టీడీపీ పై షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. అవును... ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన రోజు నుంచి బీజేపీకి వైసీపీ, టీడీపీలు బానిసగా మారాయని ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. బీజేపీ చేతిలో టీడీపీ, వైసీపీలు ఆటబొమ్మలుగా మారాయన్నట్లుగా ఆమె వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో... తాజా సమావేశంలో ఆమె మరోసారి విరుచుకుపడ్డారు. ఇందులో భాగంగా... ఒక్క ఎమ్మెల్యే, ఒక్క ఎంపీ సీటు లేకపోయినా ఏపీలో బీజేపీ పాలన సాగిస్తుందని అన్నారు షర్మిళ. ఇందులో భాగంగా గత ఎన్నికల్లో ఏపీలో బీజేపీకి ఒక్క ఎమ్మెల్యే సీటు కానీ, ఒక్క ఎంపీ సీటు గానీ ప్రజలు ఇవ్వలేదని.. అయితే... వారికి అధికారాన్ని మాత్రం ఏపీ పార్టీలు ఇచ్చేశాయని.. ఇందులో భాగంగా ఇక్కడున్న రెండు ప్రాంతీయ పార్టీలు (వైసీపీ - టీడీపీ)లు బీజేపీకి బానిసలుగా మారారని ఆమె ఫైరయ్యారు. ఈ విషయాలను ఏపీ ప్రజలు గ్రహించాలని.. ఈ రెండు బానిస పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ఆమె ఓటర్లకు పిలుపునిచ్చారు. ఇక ఏపీ రాజకీయాల్లోకి తన ప్రవేశంపై స్పందించిన షర్మిల... ఇది తన పుట్టిల్లు అని.. ఇక్కడ ప్రజలకు అన్యాయం జరుగుతోందని.. ఇక్కడి ప్రజల హక్కులు హరిస్తున్నారని.. ఈ క్రమంలో వైసీపీ, టీడీపీలు బీజేపీకి బానిసలుగా మారి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారని.. ఆంధ్ర రాష్ట్ర ప్రజల హక్కుల కోసం కొట్లాడటానికి ఈ వైఎస్సార్ బిడ్డ అడుగుపెట్టిందని చెప్పుకొచ్చారు.

## సెకండరీ గ్రేడ్ టీచర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి..




శామీర్ పేట (గరుడ వార్త) : సెకండరీ గ్రేడ్ టీచర్స్ సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సెకండరీ గ్రేడ్ టీచర్స్ సమస్యలపై ఉమ్మడి శామీర్ పేట మండల ఎస్జిటి ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో తుంకుంట ప్రైమరీ స్కూల్లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ డిఏ, పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పిఆర్సిలో ఎస్ఏ, ఎస్జీటీల వేతనాల స్కేల్ వ్యత్యాసం తగ్గించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ తొలి మెట్టు రద్దు, ఎస్జిటీల జీతభత్యాల బిల్లులు, సెలవుల మంజూరు ఎంఈఓ , కాంప్లెక్స్ హెచ్ఎంకి ఎవరికో ఒకరికి ఉండాలని కోరారు.

పాఠశాలలో స్కావెంజర్స్ నియమించాలని, ట్రాన్స్ఫర్స్, ప్రమోషన్స్ వెంటనే చేపట్టాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని పాఠశాలలకు ఒక పిఎస్ హెచ్ఎం ఇవ్వాలని, సిపిఎస్ రద్దు, ఎస్జిటీలకు ఓటు హక్కు కల్పించాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ సంఘాల ఉపాధ్యాయులు ఎం. రవీంద్ర చారి, ఎస్. సంజీవ్, ఏ. సత్యం, రాజు, హరిశంకర్, వివిధ సంఘాల మండల బాధ్యులు తిరుమలేష్, దొండ మహేష్, కుమార్, మైకల్ రెడ్డి, రాజకుమార్, రమేష్, మహిళా ఉపాధ్యాయులు కరుణశ్రీ, కల్పన, శైలజ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి...

### పార్లమెంట్ అభివృద్ధి (ఎంపీ ల్యాడ్స్) నిధులను మార్చి నెలాఖరుకు వినియోగించాలి..

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్.





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :జిల్లా వ్యాప్తంగా అన్ని అభివృద్ధి పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎక్కడ కూడా పనులు పెండింగ్లో ఉండకుండా చూడాలని ఈ విషయంలో ఆయా శాఖల అధికారులు అధికారులు పూర్తి సమన్వయంతో పనులను చేపట్టాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక అధికారి (సీపీవో) ఎం. మోహన్ రావు తో కలిసి నియోజకవర్గ అభివృద్ధి నిధులు (కాన్సిట్యూషన్సీ డెవలప్మెంట్ ఫండ్స్ సీడీఎఫ్) పార్లమెంట్ ప్రాంత అభివృద్ధి నిధులు (మెంబెర్ అఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్మెంట్ ఎంపీ ల్యాడ్స్) క్రుషియల్ బ్యాలెన్స్ ఫండ్ (సీబీఎఫ్), ప్రత్యేక అభివృద్ధి నిధులు (స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ ఎస్డీఎఫ్)కు సంంధించి జిల్లాలోని రహదారులు భవనాలు (ఆర్ అండ్ బీ ) పంచాయతీరాజ్, అటవీ శాఖ (డీఎఫ్వో), జిల్లా అభివృద్ధి నిధులు, డీడబ్ల్యువో, డీఆర్డీఏ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పోలీసు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ. జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తూ అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయడానికి ఆస్కారముంటుందన్నారు. ఎంపీ ల్యాడ్స్కు సంబంధించి మార్చి 31వ తేదీ వరకు పూర్తి చేయాలని ఈ విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించరాదని సూచించారు. అలాగే జిల్లాలోని ఆయా నియోజకవర్గాల అభివృద్ధి నిధులతో పాటు ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్డీఎఫ్) వర్క్స్ సంబంధించి పనులు ఫిబ్రవరి చివరి వరకు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ గౌతమ్ దిశానిర్దేశం చేశారు. అంతకు ముందు అధికారులతో అభివృద్ధి పనులపై నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ఇప్పటి వరకు ఎన్ని పనులు పూర్తి అయ్యాయి ? ఇంకా ఎన్ని పనులు ఏఏ స్థాయిలో పెండింగ్ దశల ఉన్నాయి...? పూర్తిగా క్యాన్సల్ అయినవి ఎన్ని ? అనే వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలో పనులు చేయని కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ విషయంలో వేరే వారికి ఆ పనులను అప్పగించడం జరుగుతుందని దీనిని దృష్టిలో పెట్టుకొని పెండింగ్ పనులను కాంట్రాక్టర్లు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు ప్రజల కోసం అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునే దిశగా అధికారులు కృషి చేయాని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అలాగే మరో పదిహేను రోజుల తర్వాత సమావేశాన్ని నిర్వహిస్తామని ఆ సమావేశం సమయం వరకు అభివృద్ధి పనులు పూర్తయ్యేలా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు

## వరద ముప్పు నివారణకు చర్యలు

కోరుట్ల : కోరుట్ల పట్టణంలో ఏటా వర్షాకాలంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల వరదలు సంభవించి లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఐదేళ్లుగా ఆదర్శనగర్, అయిలాపూర్, ప్రకాశం రోడ్, ఝాన్సీరోడ్లోని కాలనీలు పూర్తిగా నీట మునిగి ప్రజలు రోజుల తరబడి ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులు నెలకొన్నాయి. వరదలు తగ్గుముఖం పట్టే వరకు బాధిత ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. అతిభారీ వరదల వల్ల రెండేళ్లుగా ఇళ్ల నుంచి ప్రజలను ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఎలాగైనా ప్రస్తుత వర్షాకాలంలో కోరుట్ల పట్టణంలో వరదల నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ పాలకులు ముందస్తు చర్యలు చేపట్టారు.

గొలుసుకట్టు కాలువల ఆక్రమణ

ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు నుంచి మాటు కాలువ ద్వారా నీరు పట్టణ శివారులోని కంచరకుంటలోకి చేరుతుంది. కంచరకుంట నిండిన తర్వాత దాని కిందున్న వ్యవసాయ భూములకు, కోరుట్ల, తిమ్మాయిపల్లె, అయిలాపూర్‌లోని చెరువులను నింపేందుకు ప్రత్యేక కాలువలుండేవి. 20 ఏళ్ల క్రితం కంచరకుంట తూంను మట్టితో నింపేసి, కిందున్న కాలువలను చుట్టు పక్కల రైతులు పూర్తిగా ఆక్రమించుకుని పంటలు, మామిడితోటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో ఏటా వర్షాకాలంలో కంచరకుంట పూర్తిగా నిండిన తర్వాత తూం తెరిచి కాలువ ద్వారా కింది ప్రాంతానికి నీటిని విడుదల చేయకపోవడంతో చెరువులో ఎక్కువైన నీరు మత్తడి దూకి ఆదర్శనగర్ లోని కాలనీలు పూర్తిగా జలమయమవుతున్నాయి. అక్కడి నుంచి వరద నీరు మద్దుల చెరువులో చేరి అక్కడి నుంచి వెలువడ్డ వరద నీరు కింది ప్రాంతంలోని కాలువ ద్వారా ఫుల్‌వాగులో కలుస్తుండేవి కానీ.. మద్దుల చెరువు కిందున్న కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకోవడంతో కాలువ విస్తీర్ణం కుచించుకుపోయింది. దీంతో చెరువు మత్తడి నుంచి వెలువడ్డ వరద నీరు పోయేందుకు సరైన కాలువ లేకపోవడంతో అయిలాపూర్‌రోడ్, ప్రకాశంరోడ్, ఝాన్సీరోడ్, కల్లూర్‌రోడ్‌లను ముంచెత్తుతున్నాయి.

కాలువ తవ్వకంతో..



ఏటా వర్షాకాలంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో సంభవించే వరద ముప్పు నివారణ కోసం ప్రజాప్రతినిధులు, మున్సిపల్, నీటిపారుదలశాఖ అధికారులు ఈసారి ప్రత్యేక చర్యలు చేపట్టారు. మున్సిపల్ ఆధ్వర్యంలో కంచరకుంటలో పేరుకుపోయిన పూడిక, తూంను కప్పేసిన మట్టిని తొలగించారు. కంచరకుంట తూం కింద ఆక్రమణకు గురైన గొలుసుకట్టు కాలువను సుమారు 1.5 కిలో మీటర్ల మేర పూర్తిగా తవ్వించారు. తూం కాలువ ద్వారా వెలువడే వరద నీటిని ఎస్సారెస్పీ మినీ కాలువలో అనుసంధానం చేసి రైతుల సాగుకు ఉపయోగపడేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. భారీ వర్షాలు కురిసినప్పుడు ఏఖీన్‌పూర్ స్తంభాల చెరువు తూం మాటు కాలువ ద్వారా వచ్చే నీటితోనే పట్టణంలో వరదల ముప్పునకు ఎక్కువ కారణమవుతున్నాయని మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఇటీవల కమిషనర్ అయాజ్, డీఈఈ అభినయ్‌కుమార్, ఏఈ సిరాజ్‌లు కాలువ వెంబడి తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. భారీ వర్షాల సమయంలో కాలువలో నీటి విడుదలను తూం మూసివేసి నిలిపివేస్తే వరదలను నివారించవచ్చని తేల్చారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దెబ్బతిన్న కాలువ మరమ్మతులు వెంటనే చేపట్టాలని నీటిపారుదలశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల సమయంలో స్తంభాల చెరువు కాలువను మూసివేసి, కంచరకుంట తూంను తెరిచి కాలువ ద్వారా కింది ప్రాంతానికి నీటిని విడుదల చేసి పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో వరదలను తగ్గించేలా ప్రత్యేక చర్యలను అమలు చేసేందుకు మున్సిపల్ యంత్రాంగం సిద్ధమైనట్లు కమిషనర్ అయాజ్ పేర్కొన్నారు.

## మరో కండక్టర్ పై దాడులు పునరావృతం కాకూడదంటే కండక్టర్ పై దాడి చేసిన మహిళను అరెస్టు చేయాలి: గోపు శ్రీనివాస్

శామీర్ పేట, (గరుడ వార్త) : మరో మారు కండక్టర్ పై దాడులు పునరావృతం కాకూడదంటే హయత్ నగర్ 1 డిపోకు చెందిన కండక్టర్ పై దాడి చేసిన మహిళాను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని హకీంపేట్ డిపో తెలంగాణ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి గోపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండక్టర్ పై దాడి చేసి బూతులు తిట్టిన మహిళను



సుమోటా కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కండక్టర్ పై దాడి చేసిన మహిళపై చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. ఆర్టీసీ ఉద్యుగులకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## పాలకవర్గానికి ఘనంగా వీడ్కోలు

### కృపాకర్ రెడ్డిని సన్మానించిన హనుమంత్ రెడ్డి

శామీర్ పేట, (గరుడ వార్త) : గ్రామ పంచాయతీ పాలకవర్గం ఐదు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసు కున్నందున ఘనంగా వీడ్కోలు పలికారు. మూడుచింతలపల్లి మండలంలోని నాగిశెట్టిపల్లి సర్పంచ్ మొగుళ్ళ కృపాకర్ రెడ్డిని, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం చేసి బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు



గోనె హనుమంత్ రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జగన్ గూడ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, పంచాయత్ కార్యదర్శి సుచరిత, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు పైసలొచ్చాయ్...

కొత్తగూడెం : సర్కారు బడుల నిర్వహణకు ఏటా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కేటాయిస్తోంది. 2023-24 విద్యాసంవత్సరం ప్రారంభంలోనే నిధులు మంజూరవటంతో సమస్యలు తీరినట్లు అయ్యింది. గతేడాది మధ్యలో, చివరన 50 శాతం చొప్పున రెండు దఫాలుగా నిధులు అందాయి. ఈ ఏడాది ఆరంభంలోనే 50 శాతం నిధులను ప్రభుత్వం మంజూరు చేయటం గమనార్హం. పాఠశాలల నిర్వహణతో పాటు క్రీడలకు సైతం నిధులు వేర్వేరుగా విడుదల చేసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సర్కారు బడుల ఖాతాల్లో మొత్తమ్మీద రూ.3,11,10,500 జమ కానున్నాయి.

ఈసారి త్వరగా..గతంలో పాఠశాలలకు సకాలంలో నిధులు విడుదల కాకపోవటంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. విద్యుత్తు బిల్లులు, దస్తరు, సుద్ద ముక్కలు, తెల్ల కాగితాలు, హాజరు పట్టికలు, డిజిటల్ తరగతులు, కంప్యూటర్ ప్రొజెక్టర్ల నిర్వహణ తదితర సామగ్రి కొంటారు. పరీక్షలు, జాతీయ పండగల నిర్వహణ,



ప్రయోగశాలలకు పరికరాలు సమకూర్చుతారు. డిజిటల్ తరగతులు, గదుల్లో విద్యుద్దీపాలు, గాలిపంకాల మరమ్మతులు తదితర వాటికి కార్యాచరణ రూపొందించుకోవాలి. ఇటీవల చేపట్టిన బాడిబాట ఖర్చులు తొలిదశలో సకాలంలో విడుదలవటంతో ఊపిరి పీల్చుకున్నారు.క్రీడలకు సంబంధించి ప్రాథమిక పాఠశాలలకు..: రూ.5వేలు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.10వేల చొప్పున మంజూరయ్యాయి. పాఠశాల గ్రాంట్లు, క్రీడల తొలి దఫా నిధులు వచ్చాయి. వాటిని ప్రధానోపాధ్యాయులు వినియోగించుకోవాలి. సమస్యలకు అనుగుణంగా ఖర్చు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయటం శుభపరిణామం.సోమశేఖరశర్మ, డీఈఓ

## మాల్దీవులకు భారత పర్యాటకుల ఝలక్

న్యూఢిల్లీ : మాల్దీవుల దేశంలో పర్యటించే భారతీయుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఇరుదేశాల మధ్య ఏర్పడిన విభేదాలే దీనికి కారణం. గతేడాది మాల్దీవులను అత్యధిక పర్యాటకులు సందర్శించిన దేశాల జాబితాలో భారత్ తొలి స్థానంలో నిలువగా, ఈ ఏడాది జనవరి 28వ తేదీ నాటికి భారత్ 5వ స్థానానికి పరిమితమైంది. మాల్దీవుల పర్యాటక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఈ ఏడాది జనవరి 28 నాటికి మాలీవులను అత్యధికంగా సందర్శించిన పర్యాటకుల సంఖ్య పరంగా రష్యా(18,561 మంది) తొలి స్థానానికి చేరింది. తర్వాతి స్థానాల్లో ఇటలీ, చైనా, బ్రిటన్, భారత్(13,989) నిలిచాయి.

## సుందరీకరణ మాటున ఆక్రమణ

హైదరాబాద్ : రాజధాని శివారు ప్రాంతాల్లో జనావాసాలకు సమీపంలో చెరువులు కనిపిస్తే చాలు.. అక్రమార్కులు వాటి సరిహద్దులు చెరిపేస్తున్నారు.. తాజాగా ఓ స్థిరాస్తి సంస్థ నల్లగండ్ల చెరువును ఆక్రమించి.. కార్పొరేట్ సామాజిక బాధ్యత పేరుతో చెరువును సుందరీకరిస్తామంటూ రూ.50కోట్ల విలువైన భూమిని సొంతం చేసుకుంది. శేరిలింగంపల్లి, నల్లగండ్ల ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు విస్తరిస్తుండంతో సదరు సంస్థ ప్రతిష్ఠను పెంచుకునేందుకు తాజాగా చెరువు సుందరీకరణ పనులు చేపట్టింది. గోడ మరింత బలంగా ఉండేందుకు అక్కడ మట్టి పోస్తున్నారు. ఇరిగేషన్ అధికారులకు ఇవన్నీ తెలిసినా పెద్దవారి వ్యవహారమని మిన్నకుండి పోతున్నారు.

గురి చూసి కొట్టేశారు..: నల్లగండ్ల చెరువు విస్తీర్ణం 89 ఎకరాలు.. చుట్టూ 30మీటర్ల వరకూ బఫర్‌జోన్‌గా నిర్ణయించారు. రియల్ సంస్థలు ఆయా ప్రాంతాల్లో ప్రైవేటు భూములను కొని నిర్మాణాలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే నల్లగండ్ల చెరువు సమీపంలో భూములను కొన్న ఓ రియల్ సంస్థ అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టింది. చెరువుకు సమీపంలో తమ భూముల సరిహద్దు రావడంతో బఫర్‌జోన్‌లో ప్రహరీ నిర్మించారు. ప్రహరీ లోపల మొక్కలు నాటారు.

ఈ విషయమైన రంగారెడ్డి ఇరిగేషన్ అధికారి నళిని కుమారిని



ప్రశ్నించగా... కార్పొరేట్ సామాజిక బాధ్యతగా చెరువును సుందరీకరిస్తున్నారని, చెరువులో మట్టిపోస్తే చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఆ భూమి.. రూ.50 కోట్ల పైమాటే

నల్లగండ్ల చెరువు పరిసర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయన్న అంచనాతో ఐదేళ్ల క్రితమే రియల్ సంస్థ తన వెంచర్‌ను నల్లగండ్ల చెరువుకు సమీపంలో ప్రారంభించింది. జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకున్న అనంతరం నిర్మాణాలు ప్రారంభించింది. నిబంధనల ప్రకారం సెట్ బ్యాక్స్ వదలాలంటే స్థలం లేకపోవడంతో చెరువుచుట్టూ ఉన్న బఫర్‌జోన్‌లో 20 మీటర్ల వరకూ సుమారు అరకిలోమీటరు పొడవున రియల్ సంస్థ ప్రతినిధులు ఆక్రమించారు. ఆ భూమి విలువ రూ.50కోట్లపైమాటే. ఈ ఆక్రమణను కప్పిపుచ్చుకొనేందుకు అధికారికం చేసుకునేందుకు చెరువుచుట్టూ రింగ్‌బండ్ నిర్మిస్తామని, సైకిల్, వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామంటూ ప్రభుత్వ అధికారులకు తెలిపారు.

## డూప్లికేట్ దంపతుల భూ మాయ

హైదరాబాద్ : నగర శివారులో ఓ ఎన్నారైకి చెందిన రూ.కోట్ల విలువైన భూమి కొట్టేసేందుకు అక్రమార్కులు వేసిన పన్నాగానికి సబ్ రిజిస్ట్రార్ అప్రమత్తతతో అడ్డుకట్ట పడింది. కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం మున్నలూరుకు చెందిన సీహెచ్ శ్రీనివాసరావు రాజేంద్రనగర్ బుద్వేల్ జనచైతన్య హౌసింగ్ సొసైటీలో 2005లో 400 గజాల స్థలం కొన్నారు. శ్రీనివాసరావు విదేశాల్లో ఉండటంతో కొందరు అక్రమార్కులు స్థలం కొట్టేసే పన్నాగానికి తెరలేపారు. శ్రీనివాసరావు 2009లో మరణించినట్లు గతేడాది మార్చిలో నకిలీ మరణ ధ్రువపత్రం సృష్టించారు. ఓ మహిళను శ్రీనివాసరావు భార్యగా చూపిస్తూ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లారు. తన భర్త మరణించారంటూ భూమిని మరొకరికి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా.. అప్పటి రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్ రాజేంద్రకు మహిళ ప్రవర్తనపై



అనుమానంతో రిజిస్ట్రేషన్ నిలిపేశారు. అక్రమార్కులు మరో పథకం వేశారు. ఇటీవల శ్రీనివాసరావు స్థానంలో నకిలీ ఆధార్‌తో నకిలీ వ్యక్తిని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ప్రస్తుత రిజిస్ట్రార్ టి.శ్రుతి కూడా నకిలీ వ్యక్తి ప్రవర్తనపై అనుమానం వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ చేయకుండా ఆధార్ కార్డు.. భూపత్రాలతో అసలైన చిరునామాకు ఓ లేఖ పంపారు. ఈలేఖ కృష్ణా జిల్లాలోని యజమాని స్వస్థలానికి వెళ్లడంతో కుటుంబ సభ్యులు లేఖ విషయాన్ని శ్రీనివాసరావుకు చెప్పారు. అప్రమత్తమైన ఆయన సైబరాబాద్ పోలీసు కమిషనర్‌కు ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై సోమవారం రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రార్‌ని కలుస్తామని బాధితుడు వివరించారు.

## వస్తోంది రైలు.. జాగ్రత్త ప్రాణాలు

హైదరాబాద్ : రైలుపట్టాలపై మరణ మృదంగం ఆందోళన కలిగిస్తోంది. కొత్త ఏడాది 15 రోజుల వ్యవధిలోనే 32 మంది రైలుపట్టాలపై వేర్వేరు ప్రమాదాల్లో మరణించడం గమనార్హం. సికింద్రాబాద్ రైల్వే పోలీస్ పరిధిలో ఏటా 1500-1600కు పైగా రైలు ప్రమాద కేసులు నమోదైతే వాటిలో అధిక శాతం రైలుపట్టాలు దాటుతూ, ఆత్మహత్యలతో ప్రాణాలు కోల్పోతున్నవారే. పలువురు పట్టాలు దాటే ప్రయత్నం చేస్తూ మృత్యు ఒడికి చేరుతున్నారు. లింగంపల్లి-హైటెక్‌సిటీ మార్గంలో ఇటీవల ఒక యువకుడు (23) ఇయర్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటుతూ రైలును గమనించలేదు. బొల్లారం బజారు-బొల్లారం స్టేషన్ పట్టాలు దాటుతున్న దినేష్(26) రైలు ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. యూపీ నుంచి సెలవులకు వచ్చిన విద్యార్థి ఓబేష్(16) బొల్లారం వద్ద పట్టాలు దాటే ప్రయత్నంలో రైలు ఢీకొని మృతి చెందాడు. ఖైత్లాపూర్, భరత్‌నగర్, బొల్లారం, అల్వాల్, మౌలాలి, ఘట్‌కేసర్, బీబీనగర్ మార్గాల్లో ఎక్కువగా పట్టాలు దాటుతూ మరణిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. మూడేళ్లలో 1815 మంది మృత్యువాత పడ్డారు. ఘట్‌కేసర్-బీబీనగర్ రైలు మార్గంలోనే ఎక్కువ శాతం బలవన్మరణాలు నమోదవుతున్నాయి. రైలు ప్రమాదాల బారినపడిన మృతులను గుర్తించడం సవాల్‌గా మారుతోంది.

# కంచె లేదు... రక్షణ కరవు..



గోదావరిఖని : ఇది రాజన్న సిరిసిల్ల జిల్లా మధ్యమానేరు జలాశయంపై కొదురుపాక వద్ద రక్షణ కంచెతో కూడిన వంతె. ఈ వంతెన వద్ద కంచె ఏర్పాటు చేయని సమయంలో ఈ జలాశయం వద్దకు వచ్చి అందులో దూకి పలువురు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలున్నాయి. ఆత్మహత్యలకు కేంద్రంగా మారుతుండటంతో అధికారులు ఇనుప కంచెను ఏర్పాటు చేశారు.ఇది గోదావరిఖని శివారులోని కోల్‌బెల్టు వంతెన. రక్షణకోసం తక్కువ ఎత్తులో సిమెంటు గోడ ఉంది. కేవలం రెండున్నర అడుగుల ఎత్తులో ఉన్న వంతెన రక్షణగోడపై నుంచి దూకి ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రక్షణగోడ తక్కువ ఎత్తులో ఉండటంతో సులువుగా నదిలోకి దూకే అవకాశం ఏర్పడుతోంది.

కోల్‌బెల్టు వంతెన ఆత్మహత్యలకు కేంద్రంగా మారింది. ఈ ప్రాంతంలో నదిలోదూకి ఎంతోమంది ఆత్మహత్యాయత్నం చేస్తున్నారు. కొంత మందిని ఇక్కడ ఉన్న సిబ్బంది రక్షిస్తున్నా మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల ఒకే రోజు రెండు మృతదేహాలు నదిలోంచి బయటపడ్డాయి. గోదావరిఖనికి చెందిన ఇద్దరు యువకులు నదిలో దూకి బలవన్మరణాలకు పాల్పడ్డారు. కుటుంబ సమస్యలు.. వ్యక్తిగత బాధలు.. కుటుంబ కలహాలు.. అనారోగ్య సమస్యలు.. ఇలాంటివి ఏదైనా ఆత్మహత్యవైపు పురిగొల్పుతున్నాయి. గడచిన నాలుగేళ్లలో 37 మంది నదిలో దూకి ప్రాణాలు కోల్పోయారు. అక్కడ రివర్‌గార్డులను ఏర్పాటు చేయడంతో నిరంతరం పర్యవేక్షణతో 157 మందిని కాపాడారు. ఇప్పటి వరకు మొత్తం 192 మంది బలవన్మరణానికి ప్రయత్నించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలను కలుపుతూ గోదావరి నదిపై నిర్మించిన కోల్‌బెల్టు వంతెన రవాణా పరంగా రెండు జిల్లాల ప్రజలకు సౌకర్యంగా మారినప్పటికీ ఇదే వంతెన ఆత్మహత్యలకు కేంద్రంగా మారింది.

పరిశ్రమల సహకారం అవసరం

రక్షణ కంచె ఏర్పాటుకు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న భారీ పరిశ్రమల నుంచి సహకారం అవసరం. వంతెనపై ఇరువైపులా ఇనుప కంచె ఏర్పాటు చేయడం ద్వారా ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయవచ్చు. గతంలో ఎన్టీపీసీ నిధులతో ఇనుప కంచె ఏర్పాటు చేయాలని భావించారు. పోలీసు ఉన్నతాధికారులు సైతం ఎన్టీపీసీ అధికారులతో గతంలో మాట్లాడారు. నిధులు కేటాయించేందుకు ఎన్టీపీసీ మొగ్గు చూపినా పర్యవేక్షణ లేకపోవడంతో ఇనుప కంచె ఏర్పాటు ప్రయత్నాలు ముందుకు సాగలేదు. సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎ ఫ్‌సీఎల్, జెన్‌కో పరిశ్రమలకు కేంద్రమైన రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నాలుగు సంస్థల నుంచి నిధులు కేటాయిస్తే పక్కాగా కంచె ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

# అధ్యక్షా.. సమస్యలు పరిష్కరించాలి!



కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో పలు డివిజన్లలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతుండగా.. మరికొన్ని చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. అపరిష్కృత సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పాలకవర్గం ఏర్పడి నేటికి నాలుగేళ్లు పూర్తయింది. పాలకులు కౌన్సిల్ వేదికగా సమస్యలు ప్రస్తావించి గడువులోగా పరిష్కరించేలా చొరవ చూపించాలి.

ప్రశ్నార్థకంగా డంపింగ్‌యార్డు

నగరంలో డంపింగ్‌యార్డు ప్రశ్నార్థకంగా మారింది. బయోమైనింగ్ ప్రక్రియ ఆగిపోవడంతో చెత్తంతా పేరుకుపోతుంది. నాలుగు నెలలుగా పొగ వస్తుండగా ఆ ప్రాంతవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చెత్తను తగ్గించేందుకు చర్యలు, కొత్త డంపింగ్‌యార్డు కోసం ప్రయత్నాలు చేయడంలేదు. రానున్న వేసవిలో మంటలు తీవ్రమయ్యే అవకాశముంది.

అసంపూర్తిగా పనులు

నగరవ్యాప్తంగా నాలుగు నెలల కిందట రూ.132 కోట్లతో ప్రారంభించిన రహదారులు, మురుగుకాలువ పనులు పలు చోట్ల పూర్తి చేయగా, మిగతా చోట్ల పెండింగ్‌లో ఉన్నాయి. రెండు నెలలుగా తవ్వి వదిలేయగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్తంభాలు ఉన్న చోట తొలగించకుండా మురుగుకాల్వలు వంకర టింకరగా నిర్మించారు. విలీన కాలనీల్లో రానున్న వేసవిలో తాగునీటికి అవస్థలు రాకుండా ముందస్తు చర్యలు ప్రారంభించాలి. అసంపూర్తి స్మార్ట్‌సిటీ, అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి.

ఖాళీగా వెండింగ్ జోన్ల దుకాణాలు

రోడ్లపై క్రయవిక్రయాలు జరపకుండా వీధివ్యాపారుల కోసం నిర్మించిన వెండింగ్ జోన్లు నిర్మించి వదిలేశారు. కొన్ని నెలలుగా ఖాళీగా ఉంటుండగా వీటిని ఏ ప్రాతిపదికన కేటాయిస్తారనే విషయంలో స్పష్టత లేదు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆయా ప్రాంతవాసులకు కేటాయించాల్సి ఉండగా ఇతరులు పైరవీలు చేయడం, రూ.లక్షల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రోడ్లపై జీవనోపాధి చేస్తున్న వారిని గుర్తించి వీటిని అప్పగిస్తే వారికి ఆసరాగా ఉండనుంది. స్మార్ట్‌సిటీ నిధులతో అంబేడ్కర్ స్టేడియం ప్రాంతంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించగా అదీ అలాగే నిరుపయోగంగా ఉంది.

కుక్కలు..కోతులు..పందులు

నగర వీధుల్లో కోతులు, కుక్కలు, పందుల సమస్య వెంటాడుతుంది. పలు ప్రాంతాల్లో కోతులు నానాహంగామా చేస్తున్నాయి. టెండర్ల గడువు ముగియడంతో వీటిని పట్టుకోవడం లేదు. కుక్కల నియంత్రణ చర్యలు పూర్తిగా నిలిపి వేశారు. ప్రజల వెంట పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. పందులను నగరానికి దూరంగా పెంచాలని, ప్రజారోగ్యానికి ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పలు సమావేశాల్లో హెచ్చరిస్తున్నా మార్పు రావడంలేదు.

ఫిర్యాదుల పరంపర కార్యాలయం ఇంజినీరింగ్ విభాగం అధికారులపై, అభివృద్ధి పనులపై ఫిర్యాదుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల స్మార్ట్‌సిటీ, సీఎంఏ నిధులు రూ.132 కోట్ల పనులపై ఆరోపణలు వచ్చాయి. నగర పాలిక పరిధి పనులు ఇతర ప్రాంతాల్లో ఎలా చేస్తారనే విషయంపై వచ్చిన ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ చేశారు. ఒక డీఈఈని ఏకంగా బదిలీ చేశారు. ఎల్పీసీ ఇవ్వకుండా విధులు నిర్వర్తిస్తుండటంతో ఎస్ఈని కలెక్టర్ సరెండర్ చేశారు. వీటన్నింటిపై ఎలా స్పందిస్తారో చూడాలి.22 అంశాలతో ఎజెండా మొత్తం 22 ఎజెండా అంశాలతో పాలకవర్గ సభ్యులకు గత నెలలో ప్రతులను పంపించారు. వీటిలో టెండర్ నోటీసులు, హరితహారం, ఇతర రకాల బిల్లుల చెల్లింపులు, వాహనాల మరమ్మతులు, పరిపాలన అనుమతులు, ఈ-ఆఫీసు నిర్వహణకు డిజిటల్ కీలు వంటివి ఉన్నాయి.

# బకాయిల గుదిబండ

జగిత్యాల : బిల్లుల బకాయిలు విద్యుత్తు శాఖకు గుదిబండగా మారాయి. జిల్లాలో రూ.కోట్లలో బిల్లులు పెండింగ్‌లో ఉండగా అందులో అత్యధికంగా ప్రభుత్వ కార్యాలయాలవే ఉన్నాయి. ఆయా శాఖలు ఎప్పటికప్పుడూ చెల్లిస్తే సమస్య ఉండేది కాదని.. ఇప్పుడు భారీగా బకాయిలు పేరుకుపోవటంతో శాఖకు భారంగా మారిందని.. బిల్లులు చెల్లించాలని సంబంధిత అధికారులు కోరుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. జిల్లాలో విద్యుత్తు కనెక్షన్లు 3,21,776 ఉండగా ఇందులో వాణిజ్యం 36,526 ఉండగా మొత్తం 5,04,093 ఉన్నాయి. గృహాల నెలవారి బిల్లుల వసూళ్లలో కొంత మేర బకాయిలు ఉంటుండగా ఒకటి రెండు నెలల్లోనే చెల్లిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనే రూ.96.30 కోట్ల మేర బకాయిలున్నాయని విద్యుత్తు అధికారులు వెల్లడించారు. ఇందులో రెవెన్యూ కార్యాలయాలు రూ.58.54 లక్షలు, పాఠశాలలు, విద్యాశాఖ కార్యాలయాలు రూ.1.29 కోట్లు, మోడలు స్కూళ్లు 13.7 లక్షలు, వ్యవసాయ మార్కెటింగ్ రూ.3.05 లక్షలు, కొత్తగా నిర్మించిన రైతు వేదకల బిల్లులు రూ.5.33 లక్షలు ఉండగా ప్రభుత్వ వైద్యశాలలకు చెందిన రూ.28.70 లక్షలు, ప్రాథమిక వైద్యశాలలు రూ.56.53 లక్షలు ఉన్నాయి. జగిత్యాల నర్సింగ్ కళాశాలకు సంబంధించి రూ.8.11 లక్షలు ఉండగా అన్ని పోలీస్ స్టేషన్ల బిల్లులు రూ.11.42 లక్షలు, పోలీస్ క్వార్టర్ల బిల్లులు రూ.72.33 లక్షలు, జిల్లా ఫైబర్ గ్రిడ్‌కు రూ.3.89 లక్షలు పేరుకుపోయాయి. పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ.9.45 లక్షలు, మండల ప్రజా పరిషత్తు కార్యాలయాల బిల్లులు రూ.1.17 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇరిగేషన్‌వి రూ.కోట్లలోనే..ఇరిగేషన్ శాఖ బిల్లులు రూ.కోట్లలో పేరుకుపోయాయి. గ్రామ పంచాయతీలు వీధి దీపాలు, మోటార్ల బిల్లులు రూ.11.18 కోట్లు, పంచాయతీరాజ్ గ్రామ పంచాయతీ భవనాల బిల్లులు రూ.11.80 లక్షలు, ఇరిగేషన్ రూ.32.99 కోట్లు, వాటర్ గ్రిడ్ రూ.20.99 కోట్లు ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టు రివర్స్ పంపింగ్ బకాయిలు రూ.25.97 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని విద్యుత్తు అధికారులు తెలిపారు. వీటితోపాటు గృహాలు, పరిశ్రమలు కలుపుకుని దాదాపు మరో రూ.10 కోట్లకుపైగా బకాయిలున్నాయి. చెల్లించాలని కోరుతున్నాం జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్తుశాఖకు చెల్లించాల్సిన బకాయిలు భారీగా పేరుకుపోయాయి. బిల్లులు చెల్లించాలని ప్రతినెలా కోరుతున్నా చెల్లించడంలేదు. ఉన్నతాధికారులు, ప్రభుత్వమే నిర్ణయం తీసుకుని బిల్లులు చెల్లించేలా చూడాలని కోరుతున్నాం. ఇంత మొత్తంలో బకాయిలు పేరుకుపోతే కష్టంగా మారుతుంది. జి.సత్యనారాయణ, ఎస్ఈ, జగిత్యాల

## సిబ్బంది లేక ఇబ్బంది

ఖమ్మం : ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి సరకు రవాణా వాహనాల తనిఖీ, అంతర్రాష్ట్ర పన్నులు వసూలు చేయడంతోపాటు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంలో రవాణాశాఖ చెక్‌పోస్టులు కీలకం. ఖమ్మం జిల్లాలో ఏకైక రవాణాశాఖ చెక్‌పోస్టు కల్లూరులో ఉంది. జిల్లాలోకి ప్రవేశించే ఏపీ వాహనాలకు సంబంధించిన పన్నుల వసూళ్లతో రవాణా శాఖకు మంచి ఆదాయం వస్తుంది. ఇలాంటి కీలక చెక్‌పోస్టులో ఒక్కరే మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) విధులు నిర్వర్తించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక్కడ ఆన్‌డ్యూటీ(డిప్యుటేషన్)లో పనిచేస్తున్న ఇద్దరిని ప్రభుత్వం పాత స్థానాలకే పరిమితం చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఈనెల 29న జారీ చేయగా.. తక్షణమే ఇద్దరు ఎంవీఐలు తమ పాత స్థానాలకు వెళ్లారు. కల్లూరు చెక్‌పోస్టులో ఒక్కరే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఫలితంగా వాహనాల తనిఖీలు, పన్నుల వసూళ్లలో ఎదురవుతున్నాయి.

24 గంటలు.. ఒక్కరే విధులు

కల్లూరు చెక్‌పోస్టు విధుల్లో ముగ్గురు ఎంవీఐలు తప్పక ఉండాలి. ఇప్పటివరకు సత్తుపల్లి, ఆదిలాబాద్ ఎంవీఐలు వెంకటపుల్లయ్య, మనోహర్‌తో పాటు రెగ్యులర్ ఎంవీఐ విజయలక్ష్మి 8 గంటల చొప్పున 24 గంటలు విధులు నిర్వర్తిస్తున్నారు. వెంకటపుల్లయ్య, మనోహర్ డిప్యుటేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. వారు పాత స్థానాలకు వెళ్లారు.



విజయలక్ష్మి ఒక్కరే విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తనిఖీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో ఎంవీఐల కొరత ఉండటంతో కల్లూరు చెక్‌పోస్టుకు కేటాయించడం రవాణా శాఖకు తలనొప్పిగా మారింది. కల్లూరు చెక్‌పోస్టు డిప్యుటేషన్‌తో పాటు సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయంలోనూ వెంకటపుల్లయ్య బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఆయనను సత్తుపల్లికి కేటాయించడంతో కల్లూరు చెక్‌పోస్టు వద్ద పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

వేధిస్తున్న ఎంవీఐల కొరత

ఖమ్మం జిల్లా రవాణా శాఖను ఎంవీఐల కొరత వేధిస్తోంది. ఖమ్మం, సత్తుపల్లి, వైరా ఆర్టీఏ కేంద్రాల్లో ఒక్కొక్కరు మాత్రమే విధుల్లో ఉంటున్నారు. వీరిలో ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో సెలవుపై వెళితే భద్రాద్రి కొత్తగూడెం నుంచి ఆ రోజుకు డిప్యుటేషన్‌పై తీసుకొచ్చి విధులు కేటాయించాల్సిన పరిస్థితి. ఖమ్మంలో ఇద్దరు ఎంవీఐలు, ఇద్దరు సహాయ ఎంవీఐలు ఉండాలి. ఒక్కరు మాత్రమే కొనసాగుతున్నారు. వైరాకు ఒక్కరే ఉన్నారు. సత్తుపల్లిలో ఒక ఎంవీఐ, ఒక సహాయ ఎంవీఐ పనిచేయాల్సి ఉండగా మూడేళ్లుగా ఎంవీఐ పోస్టు ఖాళీగా దర్శనమిస్తోంది. కల్లూరు చెక్‌పోస్టులో కొనసాగుతున్న ఎంవీఐలలో ఒకరికి రోజూ సత్తుపల్లి ఆర్టీఏ కార్యాలయంలో విధులు కేటాయిస్తూ వాహనదారులు, దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. కల్లూరు చెక్‌పోస్టులో సైతం ఒక ఎంవీఐ, ముగ్గురు ఏఎంవీఐలు విధులు నిర్వర్తించాల్సి ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

కల్లూరు రవాణాశాఖ చెక్‌పోస్టులో ఎంవీఐల డిప్యుటేషన్ల రద్దు వల్ల కలిగే ఇబ్బందులను రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికే ఈ విషయంపై లేఖ రాశాం. జిల్లాలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల కొరత ఉన్నమాట వాస్తవమే. విధుల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.తోట కిషన్‌రావు, ఖమ్మం జిల్లా రవాణాశాఖాధికారి

## మెగా డీఎస్సీపై చిగురిస్తున్న ఆశలు

ఆదిలాబాద్ : ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖ సమీక్షలో భాగంగా బడులు లేని గ్రామాలు ఉండకూడదని, మూతబడిన పాఠశాలలను తిరిగి తెరిపించేలా నియామకాలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు నిలిచిన టీచర్ల పదోన్నతుల ప్రక్రియను కొనసాగించే చర్యలు చేపట్టాలని సూచించడంతో మెగా డీఎస్సీ నిర్వహణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ పరిణామాలు నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి.గత ప్రభుత్వ హయాంలో సెప్టెంబరు 9న జిల్లా ఎంపిక కమిటీ(డీఎస్సీ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ) పేరిట నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అక్టోబరులో ముగియగా.. నవంబరు 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణకు రాత పరీక్షలకు షెడ్యూల్ విడుదలైనా.. ఎన్నికల దృష్ట్యా ఆ పరీక్షలు వాయిదాపడ్డాయి. తీరా ఇప్పుడు భారాస ప్రభుత్వ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. నిలిచిన పదోన్నతులపైనా ప్రభుత్వం దృష్టిసారించడంతో పాటు మూతపడిన బడులను తెరిపించేలా చర్యలు ప్రారంభించడంతో మరిన్ని పోస్టులు పెరగనున్నాయి.టెట్కూ అవకాశం ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో అర్హత సాధిస్తేనే డీఎడ్, బీఎడ్ పూర్తిచేసిన అభ్యర్థులు డీఎస్సీ రాయొచ్చు. మెగా డీఎస్సీ దిశగా సర్కారు యోచిస్తుండటంతో వేలాది మంది నిరుద్యోగులకు మేలు జరిగేలా తొలుత టెట్ను, ఆ తర్వాత డీఎస్సీ ప్రకటన విడుదల చేస్తారనే మాట విద్యాశాఖ వర్గాల నుంచి వినిపిస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి నియామక ప్రక్రియ ముగిసేలా కసరత్తు ప్రారంభం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదే జరిగితే మాత్రం నిరుద్యోగుల ఆశలు ఫలించినట్లే. నిరాశతో ఇప్పటికే పుస్తకాలను పక్కనబెట్టిన నిరుద్యోగులు మళ్లీ రెట్టించిన ఉత్సాహంతో పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.పెరగనున్న పోస్టులు ఇప్పటికే పీజీహెచ్ఎంల పదోన్నతుల ప్రక్రియ ముగియడంతో.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 160 మంది స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి లభించింది. పదోన్నతితో ఖాళీ అయిన పోస్టులను 70 శాతం మేర ఎస్జీటీలకు రిజర్వు చేయగా.. మిగిలిన 30 శాతం పోస్టులను రిక్రూట్మెంటు ద్వారా భర్తీ చేస్తారు. నిలిచిన ఎస్జీటీ పదోన్నతులు జరిగితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500కి పైగా పోస్టులు ఖాళీ అవుతాయి. ఈ పోస్టులన్నింటిని మెగా డీఎస్సీలో భర్తీ చేయవచ్చు. ఒక్కో జిల్లాలో దాదాపు సగం పోస్టులు కొత్త డీఎస్సీలో పెరిగే అవకాశముంది.ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం- నరేందర్, జిల్లా అధ్యక్షుడు, ఎస్జీటీల సంఘంకొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యాశాఖను గాడిలో పెట్టే క్రమంలో మెగా డీఎస్సీ నిర్వహణకు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగింపునకు సానుకూలత వ్యక్తం చేయడాన్ని స్వాగతిస్తున్నాం. మూతబడిన పాఠశాలలను తెరిపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం ప్రాథమిక విద్యను బలోపేతం చేసేలా ఉంది. అటు ఉపాధ్యాయులకు, ఇటు నిరుద్యోగులకు మేలు జరిగే చర్యలు వేగవంతం చేయాలి.

# మాంసం విక్రయదారుల అయిష్టత

సిరిసిల్ల : మాంసకృత్తులు.. విటమిన్లు.. కొవ్వు పదార్థాలు లభిస్తుండటంతో మాంసం వినియోగం పెరుగుతోంది. ఆదివారం, ప్రత్యేక పండగల సమయాల్లో ఇంట్లో తప్పనిసరి వంటకంగా మారుతోంది. జిల్లాలో ఏటా 11.2 టన్నుల మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. అయితే మాంసం ప్రియులు కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. జీవాలను వధించే చోటు, వాటిని విక్రయించే తీరులో జాగ్రత్తలు తప్పనిసరి. నిల్వ మాంసం తింటే వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజల ఆరోగ్య రక్షణకు శుచి, శుభ్రత, నాణ్యమైన మాంసం విక్రయించేలా సిరిసిల్ల పురపాలక సంఘాన్ని ఒక పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. రూ.5 కోట్లతో రైతు బజారులో మాంసం విక్రయాలకు ప్రత్యేకంగా దుకాణ సముదాయాలను నిర్మించింది. దీనిలో ఎన్‌ఆర్‌సీఎం (నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఆన్ మీట్) ప్రమాణాలతో రూ.12 లక్షలతో పి-మార్టు (పోర్టబుల్ మీట్ ప్రొడక్షన్ అండ్ రిటైలింగ్ ఫెసిలిటీ)ను ఏర్పాటు చేసింది. వీటిలోని పరికరాల వాడకంపై మాంసం విక్రయదారులకు శిక్షణ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. మూడేళ్లుగా తాళం తీయని పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యేకత ఇలా..జీవాలను వధించడం.. వాటిని శుభ్రం చేసి, ముక్కలుగా దుకాణాల్లో విక్రయించడం అంతా శాస్త్రీయ పద్ధతిలో జరగాలి. ఐసీఎంఆర్ నిబంధనల ప్రకారం మాంసం వ్యర్థాలను పర్యావరణానికి హాని కలిగించకుండా చూడాలి. దీనికోసం సిరిసిల్ల పురపాలక సంఘాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. రైతు బజారులో ప్రీక్రాఫ్ట పద్ధతిలో పి-మార్టును ఏర్పాటు చేసింది.

పట్టణంలోని 50 మంది మాంసం విక్రయదారులున్నారు. వీరిలో పది మందికి తొలి దశలో ఇందులోని పరికరాల వినియోగంపై ఎన్ఆర్ సీఎంలో శిక్షణనిచ్చారు. జీవాలను వధించే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శరీరభాగాలు వేరు చేయడంలో సులభమైన పద్ధతులను వివరించారు. ఒకసారి పది జీవాలను ఇందులో వధించే వెసులుబాటు ఉంది. ఇక్కడ వేరు చేసిన మాంసాన్ని దుకాణాలకు తరలించి విక్రయించుకోవచ్చు. వెలువడిన వ్యర్థాలతో రెండు క్యూమిక్ సామర్థ్యం ఉన్న బయోగ్యాస్ ప్లాంటు ఉంది. ఈ గ్యాస్‌తో జీవాల తల, కాళ్లు కాల్చడానికి ఉపయోగించవచ్చు. దీనిని పూర్తిస్థాయిలో వినియోగిస్తే మాంసం మార్కెట్‌కు ఎఫ్ఎస్ఎస్ఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రం అందించే అవకాశం ఉంది.

రైతు బజారులో ఏర్పాటు చేసిన పి-మార్టు వినియోగం పెరిగితే పట్టణంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రణాళికలు చేశారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు యాభైశాతం రాయితీ రుణం అందజేసి వీటి ఏర్పాటుకు పురపాలకశాఖ సిద్ధంగా ఉంది. ఎన్ఆర్‌సీఎం ఉచితంగా మరో యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పురపాలకశాఖ అధికారులు తెలిపారు. కానీ ఉన్న ఒక్కటీ ఉపయోగించని పరిస్థితి ఉంది.

తనిఖీలు మరిచిన అధికారులు

మార్కెట్‌లో లభించే మాంసం ఆరోగ్యకరమైనదేనా? అంటే ఆలోచించాల్సి వస్తోంది. జిల్లాలో ఎక్కడా పురపాలక, పంచాయతీల్లో వధశాలలు లేవు. వీటిని వధించే సమయంలో పశువైద్యులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పరీక్షించాలి. ఎలాంటి వ్యాధులు లేవని నిర్ధారించాక శుభ్రమైన మాంసం అని ముద్ర వేసిన తర్వాతే ప్రజలకు విక్రయించాలి. అయితే ఇలాంటి పరీక్షలు జిల్లాలో ఎక్కడా జరగడం లేదు. పశువైద్యాధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు కూడా లేవు. ఇదే అదనుగా జీవాలను అపరిశుభ్ర వాతావరణంలో వధించడం, రోడ్ల పక్కన, కాల్వల సమీపంలో విక్రయాలు సాగించడం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం- సమ్మయ్య, కమిషనర్, సిరిసిల్ల పురపాలక సంఘంపట్టణ ప్రజలకు ఆరోగ్యకరమైన మాంసం అందించేలా పి-మార్టును ఏర్పాటు చేశాం. దాని వినియోగంపై పలు మార్లు అవగాహన కల్పించాం. అయినా ముందుకు రావడం లేదు. దీనిని వినియోగించడంపై విక్రయదారులకు ఎలాంటి రుసుం ఉండదు. స్వచ్ఛందంగా ఎవరు ముందుకొచ్చినా అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నాం.

# చేపల వేటకు విరామం

బోయినపల్లి : మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జలాశయాల్లో చేప, రొయ్య పిల్లలను వదులుతుంది. ఇవి పెరిగి పెద్దవి అయిన తరవాత చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపలు అండవిసర్జన గావించి సంతతి వృద్ధి చేసే కాలం. దీంతో రాజరాజేశ్వర, ఎగువమానేరు జలాశయాల్లో చేపల వేటను అధికారులు నిషేధించారు. జిల్లాలో బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన రాజరాజేశ్వర, గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువమానేరు జలాశయాల్లో ప్రభుత్వం చేప, రొయ్య పిల్లలను వదులుతుంది. రాజరాజేశ్వర జలాశయంలో ముంపునకు గురైన నిర్వాసితుల్లో ఆసక్తి ఉన్న వారికి ఇక్కడి జలాశయంలో చేపలు పట్టుకోవడానికి లైసెన్స్‌లను ప్రభుత్వం జారీ చేసింది. వీరితోపాటు జలాశయం పరిధిలో పది కిలోమీటర్ల లోపు ఉన్న మత్స్యకారులు చేపలు పట్టి విక్రయించుకోవడానికి అవకాశం కల్పించారు. రెండు జలాశయాల్లో ఏటా 80 ఎం.ఎం నుంచి 100 ఎం.ఎం బరువు ఉన్న చేప పిల్లలను వదులుతున్నారు. ఇందులో కట్ల, రాహు, మృగాల రకం చేప పిల్లలు ఉంటున్నాయి. నెల రోజుల వయసు ఉన్న రొయ్య పిల్లలు వేస్తున్నారు. అయిదు నెలల కాలంలో రొయ్యలు పెరిగి మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది. చేప పిల్లలు కిలో నుంచి సుమారు ఇరవై కిలోల బరువు ఉన్నవి వలలకు చిక్కుతున్నాయి. జలాశయంలో చేపల వేట కొనసాగిస్తున్న మత్స్యకారులకు నిత్యం ఉపాధి లభిస్తుంది. మత్స్యకారులతోపాటు చేపల విక్రయాలతో పలువురికి జీవనాధారం ఏర్పడింది. తాజా చేపలు లభిస్తుండటంతో రాజరాజేశ్వర జలాశయం వద్దకు కరీంనగర్, వేములవాడ, సిరిసిల్ల తదితర పట్టణాల నుంచి వచ్చి చేపలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. గత మూడేళ్లలో రెండు జలాశయాల్లో 117 లక్షల చేప పిల్లలు, 88.27 లక్షల రొయ్య పిల్లలను వదలుగా సుమారు 5,400 టన్నుల చేప, 1,403 టన్నుల రొయ్యల ఉత్పత్తి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

సంతతి అభివృద్ధి కావాలంటే...

ఏటా జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపలు అండ విసర్జన గావించి సంతతిని అభివృద్ధి చేయనున్నాయి. జలాశయాల్లో రెండు నెలల వరకు చేపల వేట నిలిపివేయాలని అధికారులు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. సంబంధిత మత్స్య పారిశ్రామిక సంఘాలు, గ్రామ పంచాయతీలకు లేఖలు పంపారు. అయితే అధికారుల సూచనలు పాటించని కొందరు మత్స్యకారులు చాటుగా చేపల వేట కొనసాగిస్తుండటంతో చేపల ఉత్పత్తిపై ప్రభావం చూపనుంది. చేపల వేట నిలిపివేయడం వల్ల సంతతి పెరిగి ఎక్కువ చేపలు పట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. దీంతో మత్స్యకారులకు మరింత ఉపాధి కలగనుందని అధికారులు పేర్కొంటున్నారు.

# సిబ్బంది కొరత.. అందని సేవలు



గంగాధర : విద్యుత్తు శాఖలో కింది స్థాయి సిబ్బంది కొరతతో వానాకాలంలో రైతులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాలు, సాంకేతిక సమస్యలతో గృహ, పరిశ్రమలకు నిరంతర సరఫరాలో అవరోధం ఏర్పడే అవకాశముంది. విద్యుత్తు శాఖలో సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సి ఉన్నా.. సిబ్బంది కొరతతో సాధ్యం కావడం లేదు.

నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన సెక్షన్-9లో నలుగురు జూనియర్ లైన్‌మెన్లు, ఇద్దరు అసిస్టెంట్ లైన్‌మెన్లు విధులు నిర్వహించేవారు. ఇందులో ఓ జూనియర్, ఓ అసిస్టెంట్ లైన్‌మెన్ అనారోగ్య సమస్యలతో సెలవులో ఉంటే మరో జూనియర్ విధులకు హాజరు కావడంలేదంటూ ఉన్నతాధికారులకు సరెండర్ చేశారు. సెక్షన్‌లో ఇద్దరు జూనియర్, ఒక అసిస్టెంట్‌తోనే వినియోగదారులకు సేవలందిస్తున్నారు. ఒకరు పగలు, మరొకరు రాత్రి విధులు నిర్వహిస్తున్నారు. గంగాధర సెక్షన్ పరిధిలోని గంగాధర, లక్ష్మీదేవిపల్లి, మంగపేట గ్రామాలకు ఒక హెల్పర్ మాత్రమే సేవలు అందిస్తున్నారు. సెక్షన్‌లో పని చేయాల్సిన లైన్‌మెన్ దీర్ఘకాలిక సెలవులో ఉన్నాడు. అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టు ఖాళీగా ఉంది. ఫ్యూజ్‌పోయిన ప్రతిసారి లైన్‌మెన్లకు చెబితే తమ పరిధి కాదని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. కురిక్యాలలో కూడా జేఎల్ఎం పోస్టు ఖాళీగా ఉంది.

నిత్యావసరం.. అంతులేని నిర్లక్ష్యం..

విద్యుత్తు వినియోగదారులకు అనుగుణంగా సేవలందించడంలో సంస్థ వెనుకబడుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త పోస్టుల సంగతి పక్కన పెడితే ఉన్న వాటిని భర్తీ చేయడంలో జాప్యం జరుగుతోంది. జిల్లాలో 278 అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులకు 210 ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ లైన్‌మెన్ పదోన్నతుల రిజర్వేషన్ వివాదం న్యాయస్థానంలో నలుగుతోంది. తుది తీర్పు వచ్చే వరకు ఖాళీగా ఉన్న ఏఎల్ఎం పోస్టులను షరతులతో కూడిన పదోన్నతితో భర్తీ చేసే అవకాశమున్నా, ఆ దిశగా యాజమాన్యం చర్యలు తీసుకోవడం లేదు.

ఉన్న వారిపై ఎక్కువ భారం

జేఎల్ఎంలు ప్రతి నెల సెక్షన్‌లో ఉన్న మూడో వంతు మీటర్లకు స్పాట్ బిల్లింగ్ చేయాలి. బకాయిలు ఉన్న వారి ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేయాలి. వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేయాలి. ఇది పరోక్షంగా రైతులకు, వినియోగదారులకు సమస్యగా మారుతోంది. ఫీడర్‌లో సాంకేతిక సమస్య ఉత్పన్నమైతే దాన్ని పరిష్కరించే వరకు కరెంటు సరఫరా కాక రైతుల పొలాలకు నీరు అందడం లేదు. నియంత్రికల వద్ద ఫ్యూజ్ పోతే రైతులే స్వయంగా సరి చేయాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి. ఈక్రమంలో అన్నదాతలు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై విద్యుత్తు సంస్థ యాజమాన్యం దృష్టి సారించాల్సిన అవసరముంది.

# అతివకు వ్యాపార నైపుణ్యం



పెద్దపల్లి : పొదుపును అలవాటుగా చేసుకొని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ప్రభుత్వం వీరికి రుణాలు అందిస్తూ స్వయం ఉపాధి వైపు ప్రోత్సహిస్తోంది. అయితే కొందరు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ సద్వినియోగం చేసుకుంటుండగా, మరికొందరు వ్యవసాయ, ఇతర గృహ అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

పట్టణాలతో చూస్తే గ్రామీణ ప్రాంతాల మహిళల్లో అక్షరాస్యత తక్కువగా ఉండటంతో ఆర్థిక ప్రగతి అంతంత మాత్రంగానే ఉంది. సంఘాల్లో దస్త్రాల నిర్వహణ, తీసుకున్న అప్పును తిరిగి చెల్లించడం, వడ్డీ లెక్కింపు, రుణాల సద్వినియోగంపై అవగాహన కొరవడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్షరాస్యత సాధించేందుకు జాతీయ గ్రామీణ జీవనోపాధుల సంస్థ(ఎన్ఆర్ఎల్ఎం) ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమానికి తెర తీసింది. బ్యాంకు రుణాలతో కనీస అవసరాలు కాకుండా వ్యాపారాభివృద్ధిలో అతివలను తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. ప్రతి సభ్యురాలికి చైతన్యం చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు.

రుణంతో సంపాదన మార్గంగా

బ్యాంకు రుణాలతో కొందరు మాత్రమే వ్యాపార రంగంలో రాణిస్తున్నారు. ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగడానికి చైతన్యం పెంపొందించనున్నారు. కొత్త విధానంపై ఇటీవల మండలానికి అయిదుగురు చొప్పున వీవోఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)లు కరీంనగర్‌లో శిక్షణ తీసుకున్నారు. వీరు మండల స్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉంటుంది. అనంతరం గ్రామ స్థాయిలో ఆర్థిక అక్షరాస్యత, అప్పులు, ఖర్చులపై కూలంకశంగా వివరించనున్నారు. కుటుంబ అవసరాలు, వ్యవసాయ ఖర్చులకు కాకుండా బ్యాంకు రుణాన్ని సంపాదన మార్గంగా మలచుకోవడానికి మెళకువలు నేర్పించనున్నారు.

ఇదీ లక్ష్యంస్వశక్తి సంఘాల మహిళలకు బ్యాంకర్లు ఆర్థిక చేయూతనిస్తున్నాయి. పొదుపు ఆధారంగా విడతల వారీగా రుణాలు మంజూరు చేస్తున్నాయి. కాగా నిరక్షరాస్యతతో సభ్యులు మోసాలకు గురవుతున్నారు. వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని రుణాలు, పొదుపు సొమ్మును సహచర సభ్యులే పక్కదారి పట్టిస్తున్నారు. సంఘాల దస్త్రాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, తీసుకున్న రుణాలను చెల్లించే విధానంపై అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కొందరు అవసరం లేకున్నా రుణాలు తీసుకొని దుబారా చేస్తున్నారు. అతివలు బ్యాంకు రుణాలను ప్రాథమిక అవసరాలకు కాకుండా తమ కాళ్లపై తాము నిలబడటంతో పాటు వ్యాపారాల్లో రాణించేలా చేయడమే లక్ష్యంగా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

15 అంశాలు యాప్‌లో నిక్షిప్తం


మహిళలు ఆర్థిక అక్షరాస్యులుగా ఎదిగేందుకు వీవోఏలు సంపూర్ణ సహకారం అందించనున్నారు. ఆర్థిక నిర్వహణపై అవగాహన, డబ్బు సంపాదన, తీసుకున్న అప్పు చెల్లించే విధానం తదితర 15 అంశాలను 'సాక్ష్యం' యాప్‌లో నిక్షిప్తం చేయనున్నారు. ఈ యాప్ ద్వారా సంఘాల సమాచారం, ఆర్థిక వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు. వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళల వివరాలపై కాకి లెక్కలకు తావుండదు.

జిల్లాలోనూ శిక్షణ తరగతులు-తిరుపతి, సెర్ప్ డీపీఎం

మహిళల ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమానికి జిల్లా ఎంపికైంది. ముందుగా మండలానికి అయిదుగురు వీవోఏలను శిక్షణకు పంపాం. వీరంతా ఆయా మండలాల్లో అతివలను చైతన్యపరచాల్సి ఉంది. జిల్లాలోనూ శిక్షణ తరగతులు నిర్వహించనున్నాం.

# ఉక్కపోత.. వ్యాధుల బెడద

పెద్దపల్లి : వేసవి వెళ్లినా ఉక్కపోత తగ్గలేదు. ఓవైపు వేడి వాతావరణ పరిస్థితులు, మరోవైపు ఉక్కపోతలో జిల్లా ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎక్కువ మంది నీరసం, మధుమేహం, రక్తపోటు తదితర సమస్యల బారిన పడటంతో పాటు దగ్గు, జలుబు, జ్వరాలతో బాధ పడుతున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గిపోవడంతో వివిధ రకాల సమస్యలతో ఆస్పత్రుల బాట పడుతున్నారు. వాతావరణ పరిస్థితులతో పెద్దపల్లిలోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఓపీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా 450 నుంచి 500 వరకు నమోదవుతోంది. ఆస్పత్రిలోని జనరల్ వార్డులో చేరే వారి(ఇన్‌పేషెంట్ల) సంఖ్య కూడా కాస్త పెరిగింది.



మొక్కుబడి పరీక్షలు

వైద్య సేవల కోసం వచ్చే రోగులకు మొక్కుబడిగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌కు బదులు సహాయకులే పరీక్షలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై ప్రశ్నించినా పట్టించుకునే వారే లేకపోయారు. ఆసుపత్రిలో సాధారణ సేవలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఓపీ విభాగంలో వైద్యులు అందుబాటులో లేక రోగులు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. సదరు వైద్యులపై రోగులకు కనీస సమాచారం అందించే వ్యవస్థ కూడా లేదు. దిగువ స్థాయి సిబ్బంది ఇచ్చిందే మాత్ర.. చేసిందే చికిత్స.. అనే పరిస్థితి నెలకొంది.

ప్రతి పనికీ ఓ ధర

ఆస్పత్రికి వచ్చే రోగుల నుంచి దిగువ స్థాయి సిబ్బంది డబ్బు వసూలు చేయడం పరిపాటంగా మారింది. వైద్య పరీక్ష స్థాయిని బట్టి డిమాండ్ చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని వారి నివేదికలు తప్పుల తడకగా ఉంటున్నాయన్న ఆరోపణలున్నాయి. గర్భిణులకు అందించే సేవల్లోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల భారాసకు చెందిన ఓ నాయకుడి భార్య ఆస్పత్రిలో పురుడు పోసుకుంది. ఈ సందర్భంగా వారం రోజుల్లో రూ.18 వేల చేతిచమురు వదిలిందని ఆయన వాపోయాడు. ఇదే పరిస్థితి ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ ఎదురవుతోంది. వీల్‌ఛైర్‌పై సిబ్బంది తీసుకెళ్తే రూ.500, బెడ్‌షీట్ మారిస్తే రూ.200.. ఇలా ప్రతి పనికీ ఓ ధర నిర్ణయించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు-శ్రీధర్, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త

ఆస్పత్రిలో డ్యూటీ వైద్యులకు బయోమెట్రిక్ అమలు చేస్తున్నాం. ఓపీ సమయంలో బయటకు వెళ్లిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు అలాంటి సమస్య మా దృష్టికి రాలేదు. రోగుల నుంచి సిబ్బంది డబ్బు వసూలు చేస్తున్నట్లు మారు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటాం.

# గుర్తించరేం.. కూల్చరేం..!

నల్గొండ : శిథిల భవనాలు, ఇళ్లను.. అందులో నివాసం ఉంటున్న కుటుంబాలను గుర్తించి ప్రమాదాల బారిన పడకుండా చూడాలని పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రీ మాన్‌సూన్ ప్రణాళికలో భాగంగా తగు కార్యాచరణ రూపొందించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికలు ఉండగా.. కొన్ని పురపాలికల్లో శిథిల భవనాలు సర్వే చేశారు. మరికొన్నింటిలో పురపాలక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు.

నిండుకున్న నిర్లక్ష్యం వానాకాలం ప్రారంభమైంది. వర్షాలు కురిస్తే శిథిలమైన గూడు ఎప్పుడు కూలుతుందో తెలియదు. చిన్నపాటి వర్షాలకే పాత పునాదులు తడిసి కూలుతున్నాయి. పురపాలికల్లో అధికారుల నిర్లక్ష్యంతో పాత ప్రహరీల కింద ప్రాణాలు పోతున్నాయి. గత ఏడాది ఏప్రిల్‌లో యాదగిరిగుట్టలో రెండు అంతస్తుల భవనం బాల్కని కూలి నలుగురు ప్రాణాలు విడిచినా అధికారులకు కనువిప్పు కలగడం లేదు. రుతు పవనాలు రాకముందే శిథిల భవనాల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సిన పుర యంత్రాంగం ఇంకా నిర్లక్ష్యం వీడటం లేదు. కాలం తీరిన భవనాలు, ఇళ్లు గుర్తించి కూల్చాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఐదు పట్టణాల్లో సర్వే..

తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐదు పురపాలికల్లో మాత్రమే శిథిల భవనాలపై సర్వే చేపట్టారు. అందులో నల్గొండ-16, భువనగిరిలో 66, ఆలేరు-4, చిట్యాల-3, హాలియా-3 చొప్పున పాతపడిన భవనాలను పుర అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేశారు. నకిరేకల్ పురపాలిక శిథిలావస్థకు చెందిన పాత భవనాన్ని కూల్చకుండా స్టోరూంగా వినియోగిస్తున్నారు. దాన్ని కూల్చి వేయకుండా, పట్టణంలో శిథిల భవనాలు తొలగించకుండా జాప్యం చేస్తున్నారు. మిగతా పురపాలికల్లో ఇంకా శిథిల భవనాల గుర్తింపు సర్వే చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

నోటీసులతో సరి..!

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని 19 పురపాలికల్లో కిందటి ఏడాది శిథిల భవనాల సర్వే చేసి 286 పాత పునాదులను కూల్చాలని పుర అధికారులు నోటీసులు జారీ చేశారు. అందులో 69 భవనాలు మాత్రమే కూల్చారు. మరో 217 శిథిల భవనాలు, ఇళ్లు కూల్చకుండా వదిలేశారు. అందులో చాలా మంది గత్యంతరం లేక పాక్షికంగా మరమ్మతులు చేయించుకుని బిక్కుబిక్కు మంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు.

కూల్చివేతలు ప్రారంభిస్తాం- రమణాచారి, కమిషనర్

నల్గొండలో ప్రీ మాన్‌సూన్ ప్రణాళికలో భాగంగా తొలి విడత 16 శిథిల భవనాలు గుర్తించి నోటీసులు జారీ చేశాం. మరో విడత సర్వే కొనసాగుతుంది. భవనాల పటిష్టతను అనుసరించి ప్రమాదకరంగా మారిన భవనాలను కూల్చివేస్తాం. వాహనాలు వెళ్లే పరిస్థితి లేకుండా ఉంటే ఆయా ప్రాంతాల్లో సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తాం.

# నవపాలిక.. ప్రగతి దీపిక

నల్గొండ : నాలుగేళ్ల క్రితం పంచాయతీలుగా ఉన్న ప్రాంతాలో కొన్ని ప్రస్తుతం పురపాలక సంఘాలుగా రూపుదాల్చి అభివృద్ధి పథంవైపు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, మిర్యాలగూడ పట్టణాలు పురపాలికలుగా కొనసాగేవి. వీటికి తోడు దేవరకొండ, హుజూర్‌నగర్, కోదాడ పట్టణాలు పురపాలికలుగా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2018 ఆగస్టు 2న చిట్యాల, హాలియా, నకిరేకల్, ఆలేరు, యాదగిరిగుట్ట, తిరుమలగిరి, నేరేడుచర్ల, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, మోత్కూరు, చండూరు, నందికొండ మొత్తంగా 12 పంచాయతీలను పురపాలికలుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పంచాయతీలుగా ఉన్న సమయంలో అరకొర ఆదాయం, ప్రభుత్వం నుంచి వచ్చే పరిమితమైన నిధులతో వీటి పాలన నిర్వహణ భారంగా ఉండేది. పురపాలికలుగా ఏర్పడిన తర్వాత ఒకేసారి ప్రజలపై భారం మోపొద్దనే ఉద్దేశంతో మూడేళ్లపాటు పంచాయతీల పన్ను విధానాన్నే అమలుచేశారు. ఇళ్లు, ఇతరత్రా నిర్మాణాలకు అనుమతి ఇవ్వడానికి 30 రోజుల సమయం నుంచి 21 రోజులకు కుదించారు. అనుమతులు ఇవ్వడానికి టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ ఏర్పాటైంది. 'టీఎస్‌బీపాస్'ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అవసరమైన అన్ని పత్రాలు సరిగ్గా ఉంటే, గంటల్లోపే అనుమతులు లభిస్తున్నాయి. పంచాయతీలలో అమల్లో ఉన్న జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం స్థానంలో పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమం కింద మహిళలు, నిరుద్యోగ యువతకు వివిధ ఉపాధి అంశాలకు సంబంధించిన అవకాశాలు గతంతో పోలిస్తే పెరిగాయి. ఆస్తి పన్ను, ప్రచార పన్ను, నీటిపన్ను, వ్యాపార, వినోదపు పన్ను, వాణిజ్య భవనాల లైసెన్సు పన్నులతోపాటు ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం, పురపాలక సంఘం గ్రాంట్స్ రూపంలో పురపాలక సంఘానికి ఆదాయం పెరిగింది. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పన్నుల వసూళ్లు, వీధిదీపాల నిర్వహణ, తదితర నిర్వహణ సిబ్బంది సంఖ్య కూడా పెరిగింది. ప్రధానంగా పారిశుద్ధ్యం, వీధిదీపాల నిర్వహణ, నీటి సరఫరా విషయంలో సేవలు పెరిగాయి.

ప్రధానంగా నిధులు ఇలా..తెలంగాణ పట్టణ ఆర్థిక వనరుల అభివృద్ధి సంస్థ, షెడ్యూల్డ్ కులాల ఉపప్రణాళిక, ప్రత్యేక అభివృద్ధి నిధులు, పట్టణ ప్రగతి కింద మంజూరయ్యే నిధులతోపాటు ఎమ్మెల్యేలు మంత్రులు, ఎంపీల నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించుకోవడంలో చొరవచూపుతున్నారు.

పనులు సాగుతున్న తీరు

చిట్యాల: పార్కు నిర్మాణం, ఓపెన్ జిమ్, వైకుంఠధామాలు(3), సమీకృత మార్కెట్ నిర్మాణం, సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణం, జాతీయరహదారి పక్కన సర్వీసు రోడ్లవెంట, ప్రధాన కూడళ్లలో మొక్కల పెంపకం, ప్రజామరుగుదొడ్ల నిర్వహణ.

నేరేడుచర్ల: సెంట్రల్ లైటింగ్, ప్రధాన రహదారుల విస్తరణ, సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం.


నకిరేకల్: ప్రధాన రహదారి విస్తరణ, సమీకృతమార్కెట్, మినీట్యాంకు బండ్, వైకుంఠధామాల నిర్మాణం. హాలియా: అంతర్గత సీసీరోడ్లు, మురుగు కాల్వలు, సమీకృత మార్కెట్, వైకుంఠధామాలు. సెంట్రల్ లైటింగ్ నిర్మాణం పనులు ప్రారంభించాల్సి ఉంది.

యాదగిరిగుట్ట: పెద్దమురుగు కాల్వ, సీసీరోడ్లు, అంతర్గత మురుగుకాల్వలు, వైకుంఠధామం, సమీకృతమార్కెట్ నిర్మాణం. ఇందులో పెద్ద మురుగుకాల్వ, కి.మీ. పొడవునా నిర్మించిన సీసీ రోడ్డు ప్రధానమైన పనులు.

ఆలేరు: సెంట్రల్ లైటింగ్, సమీకృతమార్కెట్, బైపాస్‌లో బీటీ రోడ్డు, స్ట్రామ్ వాటర్ కాల్వలు, సీసీరోడ్లు, ప్రధాన, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం. అభివృద్ధి పైనే దృష్టి..- చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్యే నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, చిట్యాల పురపాలికల్లో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతోపాటు రానున్న కాలంలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపైనే ప్రధానంగా దృష్టి సారించాను.




దిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభమైన వేళ ప్రధానమంత్రి నరేంద్రమోదీ మీడియాతో మాట్లాడారు. ఈ సారి ఆర్థిక మంత్రి 'దిశా నిర్దేశక్' బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ప్రధాని తెలిపారు. దేశం దినదినాభివృద్ధి చెందుతూ కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని తాను దృఢంగా విశ్వసిస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతో తమ ప్రయాణం కొనసాగుతుందని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై ప్రధాని ఘాటు వ్యాఖ్యలు చేశారు. "పార్లమెంట్ కార్యకలాపాలను తరచూ అడ్డుకునే ఎంపీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా, అనైతికంగా వ్యవహరించిన వారు ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకోవాలి. ఇలా అంతరాయం కలిగించేవారిని ఎవరూ గుర్తుపెట్టుకోరు. పార్లమెంట్ సమావేశాలను అడ్డుకునే వారిని ప్రజలు క్షమించరు" అంటూ విమర్శలు గుప్పించారు. అనంతరం నారీశక్తిని ప్రధాని ప్రస్తావించారు. శాంతి పరిరక్షణలో మహిళలు కీలకంగా మారుతున్నారని పేర్కొన్నారు. "కొత్త పార్లమెంట్ భవనంలో నిర్వహించిన తొలి సమావేశాల్లో 'నారీ శక్తి వందన్ అధినియమ్' పేరుతో మహిళా రిజర్వేషన్లకు ఆమోదం తెలిపి చారిత్రక నిర్ణయం తీసుకున్నాం. ఆ తర్వాత జనవరి 26న కర్తవ్యపథ్‌లో మన నారీశక్తిని ప్రపంచానికి చాటిచెప్పాం. ఈ రోజు బడ్జెట్ సమావేశాలు కూడా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మార్గదర్శకత్వంలో మొదలు కానున్నాయి. రేపు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. మన నారీశక్తికి ప్రతీక ఇదే" అని మోదీ కొనియాడారు. ప్రస్తుత లోక్‌సభకు ఇవే చివరి సమావేశాలు. ఫిబ్రవరి 9వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు కొనసాగనున్నాయి. రేపు కేంద్రం తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. గత ఘటనల దృష్ట్యా పార్లమెంట్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఐఎస్ఎఫ్ బలగాలు ముమ్మర తనిఖీలు చేపట్టాయి.




అమరావతి: ఏపీలో పాలనా వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమై.. ఊరూరా జగన్ గూండా రాజ్ మాత్రమే నడుస్తోందని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. మార్టూరులో మారణాయుధాలతో మైనింగ్ తనిఖీలు, క్రోసూరులో రౌడీ మూకల విధ్వంసానికి పోలీసుల సహకారం పూర్తిగా గాడి తప్పిన పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. మార్టూరులో మారణాయుధాలతో గ్రానైట్ పరిశ్రమల్లో తనిఖీల పేరిట చేసిన అరాచకం వ్యవస్థల విధ్వంసం కాదా? అని దుయ్యబట్టారు. మైనింగ్ శాఖలో ఒక ఏడీ స్థాయి అధికారి రౌడీలతో తనిఖీలకు వచ్చిన ఘటన రాష్ట్రంలో గూండా రాజ్‌కు ఉదాహరణగా నిలుస్తోందని.. ప్రశ్నించిన వారిపైనే కేసులు పెట్టి అరెస్టు చేసినందుకు సిగ్గుపడాలన్నారు. క్రోసూరులో ఎమ్మెల్యే కుమారుడు వందల మందితో ప్రజల ఆస్తులపై దాడికి దిగితే చర్యలు తీసుకోకపోగా.. పోలీసులు సహకరించారని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ గౌరవాన్ని దిగజార్చిన ఇలాంటి ఘటనలపై స్పందించని డీజీపీ ఎందుకని ప్రశ్నించారు. ఆ స్థాయి పోస్టులో కూర్చోవడానికి ఆయన అనర్హులని విమర్శించారు. ఒకప్పుడు దేశం కీర్తించిన రాష్ట్ర పోలీసు శాఖ.. కళ్ల ముందే పతనం అవుతుంటే కట్టడి చేయలేని డీజీపీ తక్షణమే వాలంటరీ రిటైర్మెంట్ (వీఆర్ఎస్) తీసుకోవాలన్నారు. కింది స్థాయి అధికారులు తప్పు చేస్తే సరిదిద్దాల్సిన జిల్లా ఎస్పీలు.. అరాచకాలకు కొమ్ముకాస్తున్నారని దుయ్యబట్టారు. చట్టాన్ని అమలు చేయలేని ఆయా జిల్లాల ఎస్పీలు ఖాకీ యూనిఫాం తీసేసి వైకాపా జెండానే యూనిఫాంగా కుట్టించుకోవాలన్నారు. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటున్న అధికారులు.. చట్టానికి కట్టుబడి పనిచేయాలని హితవు పలికారు. తప్పు చేసిన అధికారులను న్యాయస్థానాలు తప్పక శిక్షిస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు.

## షర్మిలకు భద్రత తగ్గింపుపై రఘువీరా ఆగ్రహం




విజయవాడ, జనవరి 31: ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల సెక్యూరిటీని ప్రభుత్వం తగ్గించడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తొలుత 4o4 గా ఉండే భద్రతను ఆ తరువాత 2o2కు తగ్గించారని కాంగ్రెస్ పేర్కొంది. ఇప్పుడు తాజాగా ఆ భద్రతను 1o1 కు తగ్గించారని తెలిపింది. అయితే తనకు భద్రత పెంచాలని జనవరి 22న ఏపీ డీజీపీకి షర్మిల లేఖ రాశారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో రఘువీరారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. భద్రత తగ్గించడంపై "ఎక్స్" వేదికగా రఘువీరా ట్వీట్ చేశారు.

**రఘువీరా ట్వీట్ ఇదే..** "ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి 4o4 సెక్యూరిటీ కలిగి ఉండే వారు. ప్రజాక్షేత్రంలో చురుకుగా ఉన్న ఈ తరుణంలో 2o2 కు తగ్గించారు. ఇప్పుడు మరలా 1o1కు తగ్గించారు. కార్యకర్తల సమావేశాల నిమ్మిత్తం మేము రాష్ట్రమంతా తిరిగినప్పుడు.. ఎన్నికల తరుణంలో, ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడం నేను గమనించాను. కాబట్టి అత్యవసరంగా, తక్షణం షర్మిల కోరిన విధంగా 4o4 సెక్యూరిటీ... ఎస్కార్ట్ వాహన సౌకర్యం కల్పించగలరు" అంటూ ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌ని ఉద్దేశించి రఘువీరా రెడ్డి ట్వీట్ చేశారు.

## అయోధ్య రాముడికి తిరుపతి వెంకన్న సాయం.. ఆ సమస్య పరిష్కారం కోసమే..





అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా పూర్తయింది. దేశవిదేశాల నుంచి వస్తున్న భక్తులతో సాకేతపురి భక్తజన సంద్రంగా మారింది. రద్దీ ఎక్కువగా ఉండటంతో రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం – టీటీడీ అనుసరిస్తున్న విధానాన్ని అధ్యయనం చేయాలని నిర్ణయించింది. దైవ దర్శనం కోసం క్యూ కాంప్లెక్స్‌లో గంటల తరబడి నిల్చున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవడంలో టీటీడీకి మంచి పేరుంది. ప్రపంచంలోనే ఎక్కువ మంది భక్తులు వచ్చే ఆలయంగా.. రెండో ధనిక దేవాలయంగా పేరుంది. దీంతో టీటీడీ అవలంబిస్తున్న రద్దీ నిర్వహణ పద్ధతుల అధ్యయనం కోసం త్వరలోనే అయోధ్య నుంచి ఓ బృందం తిరుమలకు రానున్నట్లు టీటీడీ వెల్లడించింది. అయోధ్య రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా అయోధ్య ట్రస్ట్ అధికారులు, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డితో చర్చించారు. ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడానికి తిరుపతికి వెళ్లాలనుకున్నారు. వారి విన్నపాన్ని అంగీకరించిన టీటీడీ తిరుపతికి రావాలని ఆహ్వానం పంపింది. అంతే కాకుండా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపింది. తిరుమల ఆలయానికి రోజూ 60,000 మందికి పైగా భక్తులు వస్తుంటారు. వార్షిక బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి, పండుగలు, సెలవు రోజుల్లో ఈ సంఖ్య లక్ష దాటుతుంది. దర్శన క్యూ లైన్లు, వసతి కేంద్రాలు, లడ్డూ కౌంటర్లు, టోకెన్ సెంటర్లు, అన్నప్రసాదం కాంప్లెక్స్ వంటి ప్రాంతాల్లో రద్దీ పెరుగుతుండటంతో టీటీడీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. రద్దీ నిర్వహణ విధానం ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు చక్కబెడుతోంది. మహారాష్ట్రలోని షిర్డీ సంస్థాన్, జమ్మూలోని మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్ర ట్రస్ట్ ఇప్పటికే తిరుమలను సందర్శించింది. కాగా.. టీటీడీ జమ్మూ, హర్యానా, న్యూఢిల్లీ, ముంబయి, భువనేశ్వర్, హైదరాబాద్, చెన్నై, కన్యాకుమారి, బెంగళూరుల్లో దేవాలయాలను స్థాపించింది




## రాహుల్ గాంధీ కారుపై రాళ్ల దాడి..భారత్ జోడో న్యాయ యాత్రకు బ్రేక్!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న భారత్ జోడో న్యాయ యాత్ర కాన్వాయ్‌పై ఈరోజు బెంగాల్, బీహార్ సరిహద్దులో దాడి జరిగింది. బెంగాల్‌లోని మాల్దాలో ఈ ఘటన చోటుచేసుకోగా.. గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో రాయి విసరడంతో కారు వెనుక అద్దాలు పగిలిపోయాయి. అయితే ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ విషయాన్ని పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ చీఫ్ అధిర్ రంజన్ చౌదరి వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో మాల్దాలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కాన్వాయ్‌ను కొందరు టార్గెట్ చేశారని అక్కడి నేతలు పేర్కొన్నారు. ఈ దాడి ఘటన వెనుక అధికార పార్టీకి సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. అయితే దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. రాహుల్ 'న్యాయ యాత్ర'కు పదే పదే అడ్డంకులు జరుగుతున్న నేపథ్యంలో తగిన భద్రత కల్పించాలంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే లేఖ పంపారు. ఈ క్రమంలోనే మాల్దాలోకి ప్రవేశించిన తర్వాతే అయన భయాలు నిజమయ్యాయి. బెంగాల్–బీహార్ సరిహద్దుల్లో ఈ దాడికి పాల్పడింది ఎవరన్నదానిపై విచారణ జరపాలని కాంగ్రెస్ సీనియర్ నేత ప్రదీప్ భట్టాచార్య డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల్లో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. మరోవైపు తృణమూల్ ప్రభుత్వం ఈ యాత్రకు సహకరించడం లేదని కాంగ్రెస్ ఆరోపించింది. ముర్షిదాబాద్ జిల్లాలోకి అడుగుపెట్టిన తర్వాత రాహుల్ బస చేయాల్సిన స్టేడియానికి కూడా అనుమతి ఇవ్వలేదని కాంగ్రెస్ తెలిపింది. ఇది కుట్రలో భాగంగానే జరిగిందని ఆరోపించింది.

## సొంత ఇలాఖాలో మంత్రి బుగ్గనకు నిరసన సెగ




కర్నూలు: ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి సొంత నియోజకవర్గం డోన్‌లో నిరసన సెగ తగిలింది. తెలుగుదేశం పార్టీ డోన్ ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 'టీడీపీ రైతు కరువు కేక' పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆందోళనలో వేలాది మంది రైతులు పాల్గొన్నారు.

డోన్ తెలుగుదేశం పార్టీ ఆఫీస్ నుంచి ఆర్డీవో ఆఫీసు వరకు ఎడ్ల బండ్లతో భారీ ర్యాలీ తీశారు. ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సొంత ఊరు బేతంచెర్లను కరువు మండలంగా ఎంపిక చేశారు. డోన్, ప్యాపిలీను విస్మరించారు. ఆ రెండింటినీ కరువు మండలాలుగా ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## కోనసీమ జిల్లా అల్లర్లలో కేసులు ఎత్తివేతపై ఏపీ హైకోర్టు అభ్యంతరం



అమరావతి, జనవరి 31: కోనసీమ జిల్లాలో జరిగిన అల్లర్లపై పోలీసులు నమోదు చేసిన కేసులను ఎత్తివేయడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. కేసులను ఉపసంహరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను పక్కన పెట్టాలని హైకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులపై పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్ట్ స్పష్టం చేసింది. ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలని హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కోనసీమ అల్లర్ల నిందితులపై నమోదు చేసిన కేసులు ఎత్తివేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఈరోజు (బుధవారం) విచారణ జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సాధన సమితి కన్వీనర్ జంగా బాబురావు ఈ మేరకు హైకోర్టులో పిల్? దాఖలు చేశారు. మొత్తం 6 ఎఫ్ఐఆర్‌ల కేసుల ఉపసంహరణకు రాష్ట్ర ప్రభుత్వం 2023 డిసెంబర్ 20న జీవో జారీ చేసిందని గుర్తు చేస్తూ, దానిని నిలిపివేయాలని న్యాయస్థానాన్ని కోరారు. పిటీషనర్ తరపున ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ వాదనలు వినిపించారు. ప్రభుత్వం ఏకపక్షంగా కేసులు ఉపసంహరిస్తుందని శ్రవణ్ చెప్పారు. హత్యాయత్నం కేసులను ఒక జీవో ద్వారా ఎలా ఉపసంహరిస్తారని శ్రవణ్ ప్రశ్నించారు. వాదనలు విన్న అనంతరం జీవోతో సంబంధం లేకుండా కేసులు ఎత్తివేతపై నిర్ణయం తీసుకోవాలని హైకోర్ట్ ఆదేశించింది. ప్రతి కేసును క్షుణ్ణంగా అధ్యయనం చేసిన తరువాత మాత్రమే నిర్ణయం తీసుకోవాలని పీపీ, ఏపీపీలను ధర్మాసనం ఆదేశించింది.

**పేరు మార్పుపై హింసాకాండ...** కాగా.. ఏపీలో జిల్లాల పునర్విభజన సందర్భాగా ఏర్పాటైన కోనసీమ జిల్లాకు ఆ తరువాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాగా మారుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హింసకు దారి తీసింది. అల్లర్లలో భాగంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ఆందోళనకారులు తగులబెట్టారు.

ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం... పెద్ద ఎత్తున ఆందోళనకారులపై కేసులు నమోదు చేసింది. ఆ తరువాత రాజకీయ కారణాలు చూపి ఆ కేసులను ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో కేసుల ఎత్తివేతను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది.

## జగన్ సిద్ధం సభలకు జనం సిద్ధంగా లేరు: గోరంట్ల బుచ్చయ్య చౌదరి





రాజమండ్రి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలను కలిసేందుకు సిద్ధం పేరుతో సీఎం జగన్ సభలు నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. సీఎం జగన్ సిద్ధం సభలకు వచ్చేందుకు జనం సిద్ధంగా లేరని బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సీఎం జగన్ నాశనం చేస్తున్నాడని బుచ్చయ్య చౌదరి విరుచుకుపడ్డారు. తెలుగుదేశం పార్టీ ఓట్లు తొలగించి దొంగ ఓట్లు చేర్చుతున్నారని ఆరోపించారు. ఎన్నికల భయంతో స్థానిక సంస్థల ఎన్నికలను సీఎం జగన్ నిర్వహించడం లేదని మండిపడ్డారు. జగన్ అవినీతి గురించి జనాలకు తెలిసిపోయిందని, వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయం అంటున్నారు. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌పై గోరంట్ల బుచ్చయ్య చౌదరి తీవ్ర విమర్శలు చేశారు. బావిలో కప్ప లాగా భరత్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను భరత్ విస్మరించాడని బుచ్చయ్య చౌదరి మండిపడ్డారు. రింగ్ రోడ్లు వేయిస్తానని భరత్ చెప్పారని.. ఏమయ్యాయని అడిగారు. ఏ ఒక్క అభివృద్ధి పనులు జరగలేవని విమర్శించారు. ఇటీవల చంద్రబాబు నాయుడు అధికార పార్టీ నేతలపై విమర్శలు చేశారని బుచ్చయ్య చౌదరి గుర్తుచేశారు. ఆ వ్యాఖ్యలపై మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీ భరత్, ఎమ్మెల్యే జక్కంపూడి వెన్నులో వణుకు మొదలైందని విమర్శలు గుప్పించారు.

## పెద్దాయన మనసులో మీరు ఎప్పుడూ ఉంటారు...



ప్రకాశం, జనవరి 31: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి రెండో రోజు జిల్లాలో పర్యటించారు. "నిజం గెలవాలి" కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు అక్రమ అరెస్టుతో కలత చెంది హఠాన్మరణం చెందిన వారి కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ... "మీ అందర్నీ కలవడం సంతోషంగా ఉంది. మీ అభిమానం ఆనందాన్ని కలిగిస్తోంది. మీ కోసమే నిజం గెలవాలి యాత్ర ప్రారంభించాను. చంద్రబాబు అక్రమ అరెస్టు తర్వాత.. బాధతో టీడీపీ కార్యకర్తలు మరణించడం ఆవేదన కలిగించింది. మీ బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు వేయవచ్చు కానీ... నేరుగా మిమ్మల్ని కలవాలని ఇక్కడికి వచ్చాను. టీడీపీ కోసం మీరు పోరాడుతున్నారు. పెద్దాయన మనసులో మీరు ఎప్పుడూ ఉంటారు. చంద్రబాబు సీఎం కావాలి. అందరూ చంద్రబాబుకి అండగా ఉండాలి" అని భువనేశ్వరి కోరారు. కాగా.. ఈరోజు దర్శిలో మరణించిన తురిమెళ్ళ పరిశుద్ధరావు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. పరిశుద్ధరావు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు మూడు లక్షల చెక్కును భువనేశ్వరి అందజేశారు.

**ఒంగోలులో 25 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడమే తనకు ముఖ్యమని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎంపీ అభ్యర్థి మాగుంట అయితే అన్ని నియోజక వర్గాల్లో బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అందుకోసమే తన పోరాటమని చెప్పారు. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో అభ్యర్థులు పట్టీపట్టనట్టు ఉన్నారని వ్యాఖ్యానించారు.**



# మృణాల్ అందానికి మిర్రర్ ముక్కలు

అద్దంలో అందం ముక్కలైంది.. కుర్రకారు గుండె చెక్కలైంది..!! ఇదిగో ఇక్కడ దృశ్యం అలానే ఉంది. అందంగా లేనా అసలేం కానా..! అంటూ అద్దంలోకి తీక్షణంగా చూసింది మృణాల్. ఆ తీక్షణతకు అద్దం ముక్క చెక్కలైంది. ముక్క చెక్కలైన ఆ అద్దంలో అందాన్ని చూసి కుర్రకారు గుండె ముక్కలైంది. ప్రస్తుతం ఈ అందమైన ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. అలా చెవిలోలాకులు అద్దంలో చూసుకునేందుకు ఇంతటి తీక్షణత అవసరమా? అంటూ మృణాల్ అభిమానులు ప్రశ్నిస్తున్నారు. ఈ బ్యూటీ డిజైనర్ లుక్ యూత్ ని కిల్ చేస్తోంది. మృణాల్ నెక్స్ట్ ఏంటి? అంటే.. హాయ్ నాన్న తర్వాత దేవరకొండతో ఫ్యామిలీ స్టార్ లో నటిస్తోంది. సీతా రామం- హాయ్ నాన్నా అనే రెండు బ్యాక్-టు-బ్యాక్ హిట్‌లలో నటించిన మృణాల్ విజయ్ దేవరకొండ సరసన అవకాశం రావడంతో ఉబ్బితబ్బిబ్బవుతోంది. తన కొత్త చిత్రం ఫ్యామిలీ స్టార్ లో మృణాల్ పాత్ర దాదాపు చిత్రీకరణ పూర్తయింది. ఫ్యామిలీ స్టార్ అనేది ఎమోషనల్ మూమెంట్స్‌తో కూడిన సాధారణ ఫ్యామిలీ



డ్రామా. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఫ్యామిలీ స్టార్ రెండు భాగాలలో ఉల్లాసమైన కామెడీతో నిండి ఉందని మృణాల్ వెల్లడించారు. ఆమె మరియు విజయ్ నటించిన కామెడీ సన్నివేశాలు చిత్రానికి హైలైట్‌గా నిలుస్తాయని మృణాల్ చెప్పారు. ఫ్యామిలీ స్టార్ పూర్తి వినోదాత్మక సినిమా. ఈ చిత్రం కమర్షియల్ అంశాలతో పాటు, నిజమైన విలువలతో రూపొందుతోంది. అందరూ కమర్షియల్ సినిమా చేస్తున్నారు కానీ మీరు దాని నుండి ఏమి నేర్చుకుంటున్నారు? అని ప్రశ్నిస్తే దానికి సమాధానం దీనిలో దొరుకుతుంది. గీత గోవిందం సినిమాకి దర్శకత్వం వహించిన పరశురామ్‌గారితో కలిసి పని చేయాలని చాలా ఆతృతగా ఎదురుచూసాను. అతడు అందమైన రచయిత కూడా.. అతడు మాత్రమే రాయగలిగే కొన్ని అద్భుతాలు ఉన్నాయి. అతడి అతిపెద్ద ఆయుధం అతడి రచనా నైపుణ్యం అని నేను అనుకుంటున్నాను. పరశురామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ స్టార్ 5 ఏప్రిల్ 2024న విడుదలకు సిద్ధంగా ఉంది. హాయ్ నాన్నలో తన నటనకు ప్రశంసలు అందుకుంటున్న మృణాల్ బ్యాక్ టు బ్యాక్ టాలీవుడ్ లో క్రేజీ అవకాశాలు అందుకుంటోంది. హిందీ పరిశ్రమ కంటే ప్రస్తుతం తెలుగు చిత్రసీమపైనే ఈ అమ్మడు దృష్టి సారించింది.

# దేవర.. నీ దారెటు?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ పాన్ ఇండియా లెవల్ లో చేస్తోన్న మూవీ దేవర షూటింగ్ సగానికి పైగా ఫినిష్ అయ్యింది. కొరటాల శివ ప్రెస్టీజియస్ గా తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ సినిమాని రిలీజ్ చేస్తామని ప్రకటించారు. అయితే ఇంకా పూర్తి చేయాల్సిన షూటింగ్ చాలా ఉండటంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా పెండింగ్ లో ఉంది. ఇప్పుడు మూవీలో ప్రతినాయకుడిగా ఉన్న సైఫ్ అలీఖాన్ చేతి గాయం కారణంగా నెల రోజులు రెస్ట్ తీసుకోవాల్సి ఉంది. ఈ పరిస్థితిలో షూటింగ్ ఇప్పట్లో పూర్తి కావడం కష్టం అనే మాట వినిపిస్తోంది. దీంతో ఏప్రిల్ 5 అనుకుంటున్న రిలీజ్ డేట్ ని వాయిదా వేసే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోన్న మాట. ఒక వేళ ఏప్రిల్ 5న రిలీజ్ చేయడం కుదరకపోతే నెక్స్ట్ డేట్ ఎప్పుడనేది దేవర టీమ్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. మూవీ




పోస్ట్ ప్రొడక్షన్ అంతా కంప్లీట్ అయ్యి ఫస్ట్ కాపీ చేతికి రావడానికి జూన్ లేదా జులై పెట్టొచ్చని టాక్. ఈ నేపథ్యంలో ఆగష్టులో రిలీజ్ చేద్దామని అనుకుంటే అదే నెలలో పుష్ప ది రూల్ మూవీ రిలీజ్ కి సిద్ధంగా ఉంది. ఆగష్టు 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకి రావొచ్చు. ఆ సినిమా కూడా వాయిదా పడే అవకాశం ఉందనే ప్రచారం నడుస్తోంది. అదే జరిగితే దేవరకి ఆగష్టు 15 మంచి ఛాయస్ అయ్యే అవకాశం ఉంది. ఒక వేళ పుష్ప ది రూల్ అనుకున్న సమయానికి రిలీజ్ అయితే సెప్టెంబర్ లో దేవర రిలీజ్ ప్లాన్ చేసుకోవాలి. ఆ నెలలో రామ్ చరణ్ గేమ్ చేంజర్ మూవీని రిలీజ్ చేయాలని దిల్ రాజు ప్లానింగ్ లో ఉన్నారు. శంకర్ మొత్తం కంప్లీట్ చేసి అవుట్ ఫుట్ రెడీ చేసి క్లారిటీ ఇస్తే దిల్ రాజు ప్రొసీడ్ అయిపోతారు. ఒక వేళ డిసెంబర్ సాధ్యం కాకుంటే నవంబర్, డిసెంబర్ లో నెలలు ఉన్నాయి. నవంబర్ లో సెంటిమెంట్ వర్క్ అవుట్ కాదని వెనక్కి తగ్గొచ్చు. డిసెంబర్ అనుకుంటే ప్రభాస్ రాజాసాబ్ మూవీ రిలీజ్ కానుంది. మరి ఈ డేట్స్ లో దేవర మూవీ ఎప్పుడు రిలీజ్ అవుతుందనేది ఇప్పట్లో క్లారిటీ వచ్చే అవకాశం లేదు. ఎన్టీఆర్ కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో తెరకెక్కుతోన్న ప్రాజెక్ట్ కావడంతో చాలా ప్లాన్డ్ గా మూవీని రిలీజ్ చేయాల్సి ఉంది. వీకెండ్, ఫెస్టివల్స్ అన్ని కలిసొచ్చే విధంగా ప్లాన్ చేసుకుంటే సాలిడ్ కలెక్షన్స్ వస్తాయి. లేదంటే ఇబ్బంది పడాల్సి ఉంటుందని సినీ విశ్లేషకులు అభిప్రాయం పడుతున్నారు.




# తగ్గేదేలే వాళ్లిద్దరు దూసుకొచ్చేయడం లాంఛనమే!




ప్రభాస్ హీరోగా నటిస్తోన్న 'కల్కి 2898-...అల్లు అర్జున్ నటిస్తోన్న 'పుష్ప-2- చిత్రాలు రిలీజ్ వాయిదా పడే అవకాశం ఉందని నెట్టింట ఏ రేంజ్ లో ప్రచారం సాగిందో తెలిసిందే. రెండు కూడా ఇంకా షూటింగ్ దశలోనే ఉండటం సహా పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ప్రారంభం కాకపోవడంతో ఇప్పట్లో రిలీజ్ సాధ్యమేనా? అన్న బలమైన ప్రచారం సాగింది.

కచ్చితంగా రెండు సినిమాలు వాయిదా పడటం ఖాయమని...సమ్మర్ లో రిలీజ్ కష్టమేనని మెజార్టీ వర్గం భావించింది. అయితే మేము మాత్రం తగ్గేదేలే అంటూ పుష్ప-2 టీమ్ నిన్నటి రోజున క్లారిటీ ఇచ్చేసిన సంగతి తెలిసిందే. మరో 200 రోజుల్లో వచ్చేస్తాం..మీరు రెడీగా ఉండండి అంటూ అధికారికంగా పోస్టర్ వేసి మరి చెప్పేసారు. అంటే రిలీజ్ విషయంలో సుకుమార్ ప్లానింగ్ లో ఎలాంటి మార్పులేదని తెలిపోయింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎట్టి పరిస్థితుల్లో ఆగస్టు 15న తమ చిత్రం తప్పకుండా వచ్చేస్తుం దని క్లారిటీ ఇచ్చేసారు. ఎట్టి పరిస్థితుల్లో సినిమాకి సంబంధించిన అన్ని పనులు 200 రోజుల్లో పూర్తి చేసి ప్రేక్షకుల మధ్యలో ఉంటామని చెప్పేసారు. రీషూట్లు ఉన్నా..రీరైట్ లు ఉన్నా ఏం ఉన్నా సరే ఆగస్టు 15 రిలీజ్ తధ్యం అని తేలి పోయింది. అలాగే 'కల్కి 2898- రిలీజ్ విషయంలోనూ నాగ్ అశ్విన్ ఎక్కడా తగ్గడం లేదని తెలు స్తోంది. ఉన్న సమయం మూడు నెలల్లో షూటింగ్ సహా అన్ని పనులు పూర్తి చేసి మే 9న వచ్చేయడం ఖాయమని సన్నిహితుల వద్ద అంటున్నారు. ఇప్పటికే డిలే అయిన నేపథ్యంలో ఇకపై ఎట్టి పరిస్థితుల్లో వాయిదా వేసే ఛాన్స్ లేదని గట్టిగానే చెబుతు న్నారుట. దీంతో రెండు పాన్ ఇండియా చిత్రాలు ముందుగా ప్రకటించిన తేదీకే వచ్చేస్తాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఆ రెండు చిత్రయూనిట్ లు షూటింగ్ పూర్తి చేసే పనుల్లో బిజీగా ఉన్నారు.

# బాలీవుడ్ లో భయంకర చేతబడి సినిమా!




హారర్ బ్యాక్ డ్రాప్ మూవీస్ కి బాలీవుడ్ లో ఎలాంటి క్రేజ్ ఉందో తెలిసిందే. ఇప్పుడంటే పాన్ ఇండియా ట్రెండ్ వచ్చింది కాబట్టి అన్ని భాషల్లో ఈ ఇలాంటి జోనర్ సినిమాలు అందుబాటులోకి వస్తున్నాయి. చేతబడి, దెయ్యాలు.. ఇలాంటి కాన్సెప్ట్ సినిమాలని బాలీవుడ్ ఫిలిం మేకర్స్ చాలా ప్రత్యేకంగా తెరకెక్కిస్తుంటారు. తమ మేకింగ్ తో థియేటర్లో ఆడియన్స్ కి భయంకరమైన హారర్ ఫీల్ ఇస్తుంటారు.

ఇక ఇప్పుడు మరోసారి బాలీవుడ్ నుంచి అలాంటి సినిమానే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. బాలీవుడ్ లో క్వీన్, సూపర్ 30, గుడ్ బై లాంటి సినిమాలను తెరకెక్కించిన వికాస్ బెహల్ దర్శకత్వంలో బాలీవుడ్ స్టార్ హీరో అజయ్ దేవగన్, కోలీవుడ్ హీరోయిన్ జ్యోతిక లీడ్ రోల్స్ లో నటిస్తున్న తాజా చిత్రం 'సైతాన్'. కోలీవుడ్ టాలెంటెడ్ యాక్టర్ ఆర్. మాధవన్ ఈ సినిమాలో మరో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇటీవలే సినిమా ఫస్ట్ లుక్ ని రిలీజ్ చేయగా ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇక ఈరోజు సినిమా నుంచి టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. తాజాగా రిలీజ్ చేసిన ఈ టీజర్ సినిమాపై ఒక్కసారిగా ఆసక్తిని పెంచేసింది. కంప్లీట్ బ్లాక్ మ్యాజిక్ ఆధారంగా ఈ సినిమా ఉండబోతున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది. వెకేషన్ కోసం ఓ మారుమూల గ్రామానికి వెళ్ళిన ఓ ఫ్యామిలీ అపరిచిత వ్యక్తి కారణంగా చిక్కుల్లో పడుతుంది. అతను ప్రయోగించిన చేతబడి నుంచి ఆ ఫ్యామిలీ ఎలా బయటపడింది? అనేది ఈ సినిమా అసలు కథగా టీజర్ చూస్తే తెలుస్తోంది. ఆర్. మాధవన్ ఈ సినిమాలో నెగిటివ్ షేడ్స్ ఉండే పాత్రలో కనిపించబోతున్నట్లు టీజర్ లో చూపించారు. జియో స్టూడియో సమర్పణలో అజయ్ దేవగన్, జ్యోతి దేశ్ పాండే, అభిషేక్ పాఠక్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మార్చి 8న ఈ సినిమాని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇక ఈ సినిమాతో పాటు అజయ్ దేవగన్ 'మైదాన్' అనే సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇండియన్ ఫుట్ బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీం జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో అజయ్ దేవగన్ అబ్దుల్ రహీం పాత్రలో కనిపించబోతున్నారు. అమిత్ మిశ్రా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రంజాన్ కానుకగా విడుదల కానున్నట్లు తెలుస్తోంది.

# బ్లాక్ లో బ్యూటీ... దెయ్యం అన్నా పర్వాలేదు

యూనివర్శిల్ స్టార్ కమల్ హాసన్ నట వారసురాలు శృతి హాసన్ పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియాలో ఆమె సందడి అంతా ఇంతా కాదు. రెగ్యులర్ గా శృతి హాసన్ తన అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. శృతి హాసన్ ఎక్కువగా బ్లాక్ కలర్ లో కనిపిస్తూ ఉంటుంది. శృతి హాసన్ ఎక్కువ సార్లు బ్లాక్ డ్రెస్ లో మెటల్ ఆర్నమెంట్స్ తో కనిపించింది. దాంతో చాలా మంది కూడా సోషల్ మీడియాలో శృతి హాసన్ బ్లాక్ డ్రెస్ లో దెయ్యం మాదిరిగా ఉందని కామెంట్స్ చేశారు. బ్లాక్ మేకప్ తో కూడా పలు సార్లు సోషల్ మీడియాలో శృతి హాసన్ కనిపించింది. తాజాగా శృతి హాసన్ ఆ విషయమై స్పందించింది. నేను ఒక నటిని. నాకు పొగడ్తలతో పాటు అప్పుడప్పుడు విమర్శలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. నేను విమర్శలకు ఎప్పుడు కూడా



బాధ పడను. వాటిని కూడా నేను ప్రశంసలు గానే స్వీకరిస్తాను అంది. విమర్శలు, ప్రశంసలు ఒకే విధంగా స్వీకరిస్తాను అంది. నాకు బ్లాక్ డ్రెస్ మరియు మెటల్ ఆర్నమెంట్స్ ధరించడం ఇష్టం. నా ఇష్ట ప్రకారం నా ఔట్ ఫిట్ ను డిజైన్ చేయించుకుంటాను. విమర్శలకు భయపడి నేను ఏమీ ఆందోళన చెందను. ఒక వేళ నన్ను బ్లాక్ డ్రెస్ లో చూసిన వాళ్లు దెయ్యం అన్నా నేను పట్టించుకోను అని శృతి హాసన్ చెప్పుకొచ్చింది. నన్ను నేను బ్లాక్ డ్రెస్ లో అద్దం లో చూసుకున్న సమయంలో చాలా సంతోషంగా అనిపిస్తుందని పేర్కొంది. తాజాగా సలార్ సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన శృతి హాసన్ ప్రస్తుతం తెలుగు తో పాటు హిందీ సినిమాల్లో వరుసగా నటిస్తోంది. తాజాగా తమిళంలో ఒక బయోపిక్ ను చేసేందుకు రెడీ అయ్యింది. ఆ లేడీ ఓరియంటెడ్ మూవీకి సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి.

# నిహారిక విడాకుల గురించి ఓపెన్ అయ్యింది

మెగా డాటర్ నిహారిక విడాకులతో షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. చైతన్య జొన్నల గడ్డతో ధాంపత్య జీవితానికి స్వస్తి పలుకుతూ ఇద్దరు విడాకులతో వేరయ్యారు. ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో పెళ్లైన రెండేళ్లకే దూరమయ్యారు. అయితే విడాకులకు గల కారణాలపై చైతన్య గానీ...నిహారిక గానీ ఇంతవరకూ ఎక్కడా స్పందించలేదు. ఈ నేపథ్యంలో తొలిసారి నిహారిక స్పందించింది . 'పెళ్లి తర్వాత నేను సినిమాలు చేయలేదు. పెళ్లి చేసుకోవడం వల్లే సినిమాలు మానేసానని చాలా మంది అనుకున్నారు. మావదిన లావణ్యని కూడా ఇదే ప్రశ్న అడిగారు. అది మా వృత్తి. మేము ఎందుకు వదిలేస్తాం. నిర్మాతగా బిజీగా ఉండటంతో నటనకు దూరమయ్యాను అంతే. కానీ పెళ్లి చేసుకునే ముందు ఒకరి గురించి ఒకరు తెలుసుకోవాలి. అది



తెలియకుండా మనకు సెట్ అవ్వని వ్యక్తిపై ఆధారపడకూడదు. వాళు మన ఇంట్లో అమ్మ-నాన్నలా ఉండరు కదా. అంత ప్రేమగా అస్సలు చూసుకోలేరు. అందుకే ఎవరి మీద ఆధారపకుండా ఒంటరిగా ఎలా ఉండాలో ఈ మధ్యే నేర్చుకున్నాను. నాది పెద్దలు కుదిర్చిన సంబంధం. విడాకులు తీసుకున్న సమయంలో చాలా మాటలు అన్నారు. బాధ కలిగి ఏడ్చాను. అలాంటి వాటిని భరించడం అంత ఈజీ కాదు. ఎవరైనా జీవితంలో కలిసి ఉండాలనే పెళ్లి చేసుకుంటారు. ఏడాదిలో విడిపోతామని తెలిసి ఎవరూ అంత ఖర్చు పెట్టి పెళ్లి చేసుకోరు. కానీ ఏది అనుకున్నట్లు జరగదు కదా. నా గురించి రాసినా పట్టించుకునే దాన్ని కాదు. కానీ నా క్యారెక్టర్ ని తప్పు బట్టారు. నా కుటుంబాన్ని దూషించారు. అప్పుడు తట్టుకోలేకపోయాను. కానీ నా కుటుంబం నన్ను ఎప్పుడు బరువు అనుకోలేదు. ఈ రెండేళ్లలో కుటుంబం విలువ ఏంటో తెలిసింది. పెళ్లి-విడాకుల తర్వాత ఎవర్నీ నమ్మకూడదని అర్ధమైంది. ఇదొక గుణపాఠం. ఎప్పటికీ సింగిల్ గా ఉండిపోను. నాకింకా 30 ఏళ్లే. మంచి వ్యక్తి దొరికితే మళ్లీ పెళ్లి చేసుకుంటా' అంది.




# పోలీస్ శాఖలో ప్రక్షాళనకు పూనుకున్న ప్రభుత్వం..



హైదరాబాద్: పోలీస్ శాఖలో ప్రక్షాళనకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూనుకుంది. పోలీసులలో అవినీతి ఆరోపణలపై సర్కార్ సీరియస్ అయ్యింది. నగర శివార్లల్లో మూకుమ్మడి బదిలీలకు రంగం సిద్ధం చేసింది. అవినీతి ఆరోపణలపై విచారణకు స్పెషల్ బ్రాంచ్ ఇంటెలిజెన్స్ పోలీసులను ప్రభుత్వం రంగంలోకి దింపింది. హైదరాబాద్‌లో ఇప్పటికే 52 మంది ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. త్వరలో బడా పోలీస్ అధికారులు కూడా బదిలీ కానున్నారు. పోలీసులు జోక్యం చేసుకున్న భూ వివాదాలపై ఇంటిలిజెన్స్ ద్వారా ప్రభుత్వం సమాచారాన్ని సేకరిస్తోంది. ఇప్పటికే ఉన్నతాధికారులకు అవినీతి అధికారుల చిట్టా చేరింది. రాబోవు రోజుల్లో ట్రై కమిషనరేట్ పరిధిలో భారీగా కీలక అధికారుల బదిలీలు ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీస్ శాఖ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. మొదట గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ట్రై కమిషనరేట్స్ పోలీస్ కమిషనర్లను బదిలీ చేసింది. ఇకపై ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్‌ల విషయంలో రాజకీయ రికమెండేషన్స్, ఎమ్మెల్యే లెటర్స్ పని చేయవని, ప్రతిభావంతులకే పట్టం కట్టి పోస్టింగ్‌లు ఇస్తామని ఇటీవల సీపీలు ప్రకటించారు.




# హైదరాబాద్ సీపీ సంచలన నిర్ణయం...

పంజాగుట్ట: హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ సిబ్బంది మొత్తాన్ని బదిలీ చేశారు. స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సైల నుంచి హోంగార్డుల వరకు అందర్నీ ఒకేసారి బదిలీ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 85 మందిని బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వీరిని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసుల విషయంలో గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలోనే సీపీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

బోధన్ మాజీ ఎమ్మెల్యే తనయుడి వ్యవహారంతో పాటు వివిధ కీలక విషయాలు బయటకి పొక్కడంపై సీపీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పంజాగుట్ట పీఎస్‌కు కొత్తగా 82 మంది సిబ్బందిని నియమించారు. నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బందిని ఇక్కడికి బదిలీ చేశారు.

# కవిత నాలుక దగ్గర పెట్టుకొని మాట్లాడు.. పొన్నం హెచ్చరిక



హైదరాబాద్, జనవరి 31: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ మంత్రుల మాటల దాడులు కొనసాగుతున్నాయి. మహనీయులు జ్యోతిరావుపూలే విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో పెట్టాలంటూ కవిత చేసిన ప్రతిపాదన వివాదానికి దారి తీసింది. "పదేళ్లు మీ ప్రభుత్వంలో ఏం చేశారు" అని నిన్న మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించగా.. పది సంవత్సరాలు బీఆర్ఎస్‌కు పూలే గుర్తుకు రాలేదా? అంటూ నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. బుధవారం మీడియాతో మాట్లాడిన మంత్రి... కవిత నాలుక దగ్గర పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చాక సామాజిక న్యాయం గురించి మాట్లాడాలని హితవుపలికారు. పూలే విగ్రహం పేరుతో కవిత రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కవిత లిక్కర్ కేసులో బిజీ లేనట్టున్నరని... అందుకే కొత్త నినాదం ఎత్తుకున్నారని మంత్రి పొన్నం ఎద్దేవా చేశారు.

**కులగణనకు సూచనలు ఇవ్వండి...** కులగణన చేస్తామని మాట ఇచ్చామని... చేస్తున్నామని మంత్రి తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేశ వ్యాప్తంగా కులగణన చేస్తామన్నారు. కులగణనకి సంబంధించి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కులగణన శాస్త్రీయంగా జరుగుతుందని స్పష్టం చేశారు. కులగణన బలహీన వర్గాల కోసం తీసుకుంటున్న నిర్ణయం అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఏసీబీ కస్టడీకి శివబాలకృష్ణ.. అక్రమ అనుమతులు, బినామీ ఆస్తులపై ఆరా

హైదరాబాద్: హెచ్‌ఎమ్‌డీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణను ఏపీసీ కస్టడీలోకి తీసుకుంది. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌గా ఉన్న ఆయన్ను.. నేటి నుంచి 8 రోజుల వరకు కస్టడీలోకి తీసుకొని విచారించనుంది. కాగా ఆదాయానికి మంచిన ఆస్తుల కేసులో శివబాలకృష్ణ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఎనిమిది రోజుల కస్టడీకి నాంపల్లి ఏసీబీ కోర్టు అనుమతించింది. దీంతో బాలకృష్ణను మరింత లోతుగా ప్రశ్నించనున్నారు ఏసీబీ అధికారులు. బాలకృష్ణ హయాంలో జరిగిన అవినీతిని బయటకు తీయనున్నారు. అక్రమ అనుమతులు, బినామీ ఆస్తులపై ఆరా తీయనున్నారు. మరోవైపు హెచ్ ఎండీఏ, రేరా, మెట్రోలో జరిగిన అక్రమాలకు సంబంధిచిన కేసులో అవినితి నిరోధక శాఖ(ఏసీబీ) విచారణ ఎదుర్కొంటున్న శివబాల కృష్ణపై హైదరాబాద్ మెట్రో పాలిటన్ అథారిటీవేటు వేసింది. శివ బాలకృష్ణను సస్పెండ్ చేస్తూ మంగళవారం హెచ్ఎండీఏ కమిషనర్ దాన కిషోర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఇక పుప్పాలగూడ



447సర్వే నంబర్‌లో అనుమతులపై సూర్య ప్రకాష్ అనే వ్యక్తి ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో బాలకృష్ణ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే రూ.100 కోట్ల విలువైన బాలకృష్ణ అక్రమ ఆస్తులను గుర్తించారు.

# భూపాలపల్లిలో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్..

జయశంకర్ భూపాలపల్లి : భూపాలపల్లిలో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. జాతీయ పార్టీగా ఓ వెలుగు వెలగాలనుకుంటే తెలంగాణలోనే ఓటమి పాలై ఆ ఆశలన్నీ అడుగంటాయి. ఇంట గెలవలేకపోవడంతో రచ్చ గెలుపుపై దాదాపు ఆశలు వదిలేసుకుంది. ఇక ప్రస్తుతం తెలంగాణలో సొంత పార్టీ నేతలంతా ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. తాజాగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణ రావు సమక్షంలో ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

BHARAT RASHTRA SAMITHI
BRS
భారత రాష్ట్ర సమితి



# ఆర్టీసీ సిబ్బందిపై వరస దాడులు.. హెచ్చరించినా మార్పు రాని వైనం..

ఆర్టీసీ బస్సులో ప్రయాణం.. సురక్షితం – శుభప్రదం అనే మాటలు కేవలం రాతలకు పరిమితమవుతున్నాయి. ప్రయాణీకుల భద్రతే లక్ష్యంగా సేవలందిస్తోన్న ఆర్టీసీ సిబ్బందికే రక్షణ లేకుండా పోతోంది. డ్రైవర్లు, కండక్టర్లపై దాడులు నిత్యకృత్యంగా మారాయి. నానా బూతులు తిడుతూ, దుర్భాషలాడుతూ, కొడుతూ, తంతూ పలువురు దాడికి పాల్పడుతున్నారు. దీంతో తమ విధులు తాము సక్రమంగా నిర్వర్తించుకోలేకపోతున్నామని వాపోతున్నారు. వరసగా జరుగుతున్న ఘటనలే ఈ పరిస్థితికి నిదర్శనంగా మారాయి. ఈ దాడులపై ఉన్నతాధికారులు స్పందించి హెచ్చరిస్తున్నా మార్పు రాకపోవడం గమనార్హం. తాజాగా హయత్‌నగర్ డిపో–1కు చెందిన కండక్టర్‌పై మహిళా ప్రయాణికురాలు దాడి చేసింది. ఇద్దరు కండక్టర్లపై ఓ మహిళా ప్రయాణికురాలు నానా దుర్భాషలాడుతూ దాడికి పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. బస్సులో ఉన్న తోటి మహిళా ప్రయాణికులు ఎంత వారించినా సదరు మహిళ పట్టించుకోకుండా కండక్టర్ పై దాడికి పాల్పడింది. ఈఘటనపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించారు. ఆర్టీసీకి డ్రైవర్లు, కండక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లని, వారిపై దాడి చేయడం సరికాదని ఎండీ సజ్జనార్ అన్నారు. కొత్తగూడెం జిల్లాలో డ్రైవర్, కండక్టర్?ను ప్యాసింజర్లు దూషించడం, ఆటో డ్రైవర్లు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కాగా.. ఇలాంటి ఘటనలు గతంలోనూ జరిగాయి. అధికారులూ హెచ్చరించారు. కానీ పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. చిల్లర ఇవ్వలేదనో లేక వచ్చిన స్టాప్ వివరాలు ఇవ్వలేదనో సరిగ్గా స్పందించలేదనో ఇలా ఎన్నో కారణాలతో ప్రయాణికులు దాడికి పాల్పడగా.. రోడ్డుపై ప్రయాణించే తోటి వాహనదారులు కూడా దాడికి పాల్పడటం గమనార్హం. రేవంత్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణీకుల మధ్యే ఎన్నో గొడవలు జరిగాయి. వాటిని ఎంతో నేర్పుతో, ఓర్పుతో సహించిన సిబ్బందిపైనే ఇలా దాడికి పాల్పడుతుండటం ఆందోళన కలిగించే విషయం.

# ఫిబ్రవరి 2న ఇంద్రవెల్లికి సీఎం రేవంత్.. ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

ఆదిలాబాద్ : ఫిబ్రవరి 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో ఇంద్రవెల్లిలో సభ ఏర్పాట్లను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సీఎం సభకు త్వరగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండొద్దన్నారు. కాగా, ఇంద్రవెల్లి నుంచే పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని రేవంత్ రెడ్డిప్రారంభించనున్నారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగానే ఇంద్రవెల్లిలో భారీ సభ నిర్వహించిన ఆయన సీఎం అయిన తర్వాత కూడా తొలి సభను అక్కడే నిర్వహించబోతున్నారు. ఇంద్రవెల్లి అమరుల స్మారక స్మృతి వనానికి శంఖుస్థాపన చేయనున్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తొలి సభ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.





# కుమారి ఫుడ్ స్టాల్ స్థల మార్పు నిర్ణయంపై రేవంత్ కీలక ఆదేశాలు..

హైదరాబాద్: చిరు వ్యాపారి కుమారి ఫుడ్ స్టాల్ స్థలాన్ని మార్చాలన్న అధికారుల నిర్ణయంపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫుడ్ స్టాల్ స్థల మార్పు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ, ఎంఏయూడీ అధికారులకు రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. కుమారి మొన్నటివరకు వ్యాపారం చేసుకున్న స్థానంలోనే తన వ్యాపారాన్ని తిరిగి కొనసాగించుకోవచ్చని తెలిపారు. ప్రజా పాలనలో సామాన్యులకి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. త్వరలోనే ఆమె స్టాల్‌ను సందర్శిస్తామని సైతం రేవంత్ తెలిపారు.

**అసలేం జరిగిందంటే..** హైదరాబాద్ స్ట్రీట్ ఫుడ్ అనగానే ఇటీవలి కాలంలో కుమారి పేరు బాగా వినిపిస్తోంది. ఆమె కొన్నేళ్లుగా వ్యాపారం నిర్వహిస్తున్నప్పటికీ ఇటీవలి కాలంలో కొందరు యూట్యూబ్ ఛానల్స్ వాళ్లు బ్లాగ్స్ చేయడంతో ఆమె వీడియోలు బాగా వైరల్ అయిపోయాయి. దీంతో ఆమె ఓవర్ నైట్‌లో యూట్యూబ్ స్టార్ అయిపోయింది. మధ్యాహ్నం ఒంటి గంట అయితే కుమారి ఫుడ్ ట్రక్ వద్ద విపరీతమైన రద్దీ ఉంటోంది. తాజాగా ఆ ఏరియాలో ఆమె ఫుడ్ స్టాల్ కారణంగా విపరీతంగా ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది.

దీంతో నిన్న ఆమె ఫుడ్ ట్రక్‌ను ట్రాఫిక్ పోలీసులు అడ్డుకున్నారు. ఆమె పోలీసులను ఫుడ్ వేస్ట్ అవుతుందని వేడుకోవడంతో వదిలేశారు. కాగా.. గత రాత్రి ఆ ఏరియాలో స్ట్రీట్ ఫుడ్ కోసం వేసి టెంట్లన్నింటినీ పోలీసులు తొలగించారు. ఫుడ్ స్టాల్ స్థలాన్ని మార్చాలని అధికారులు ఆదేశించారు. ఈ విషయాలన్నీ సీఎం రేవంత్ దృష్టికి వెళ్లడంతో ఆయన ఫుడ్ స్టాల్ స్థల మార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# కేటీఆర్‌ను కొడుకని సంబోధిస్తూనే షాకిచ్చిన మాణిక్యం ఠాగూర్



హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌ను కొడుకు అని సంబోధిస్తూనే కాంగ్రెస్ పార్టీ నేత మాణిక్యం ఠాగూర్ షాక్ ఇచ్చారు. కొడుకుకు పరువు నష్టం నోటీసు పంపినట్టు మాణిక్యం ఠాగూర్ తెలిపారు. కేటీఆర్ తన ఫామ్ హౌస్‌లో ఉల్లాసంగా గడుపుతూ ఉండొచ్చు కానీ 7 రోజుల్లో నోటీసుపై స్పందించాలని మాణిక్యం ఠాగూర్ కోరారు. కేటీఆర్ 7 రోజుల్లో స్పందించకపోతే కోర్టుకు వెళ్తామని తెలిపారు. జనవరి 28న సిరిసిల్లలో కేటీఆర్ చేసిన కామెంట్స్‌పై మాణిక్యం ఠాగూర్ నోటీసులు ఇచ్చారు.

వాహనదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్ చలాన్ల గడువు జనవరి 31వ తేదీన ముగియనున్న తరుణంలో.. ఆ గడువుని మరోసారి పొడిగించింది. ఫిబ్రవరి 15వ తేదీ వరకు చలాన్ల చెల్లింపునకు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇంకా చాలామంది చలాన్లు చెల్లించని నేపథ్యంలో.. ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.




Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com